

KADILIMCHE VAARTHA Telugu daily

కదిలించే వార్త

తెలుగు దినపత్రిక

NATIONAL NEWS CHANNEL

బ్యూరో చీఫ్ జోడు రమేష్ కుమార్, కడప జిల్లా, అన్నమయ్య జిల్లా సంపుటి : 11 సంచిక : 233 ఆదివారం 23 ఆగస్టు 2026 పేజీలు 8 వెల : 05

Published From Kadapa : Circulated at | Ananthapuram | Tirupati | Vishakapatnam | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Vijayawada | Ongole | Chittore | Khammam | Hyderabad | Mahabubnagar

## న్యాయసేతు అనేది ఒక వారధి

- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- వేగవంతమైన ఆర్థిక పురోగతికి పటిష్ఠమైన న్యాయ వ్యవస్థలే వెన్నెముక
- ఢిల్లీలో జరిగిన 11వ బ్రిక్స్ ప్లస్ లీగల్ ఫోరంలో పాల్గొన్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- అక్కడ న్యాయనామిక్స్, న్యాయ సేతు అనే పదాలను పరిచయం చేసిన ప్రధాన న్యాయమూర్తి



## విమాన ప్రయాణికులకు బిగ్ రిలీఫ్

- ఇకపై 'ఈ-బోర్డింగ్ పాస్' ఉంటే చాలు!
- ఎయిర్‌పోర్టుల వద్ద బోర్డింగ్ పాస్‌పై కేంద్రం కీలక నిర్ణయం
- అంతర్జాతీయ విమాన ప్రయాణికులు ఇకపై ఫిజికల్ బోర్డింగ్ పాస్‌ను తీసుకురావాల్సిన అవసరం లేదని వెల్లడి





## వందేమాతరంపై దేశవ్యాప్తంగా కార్యక్రమాలు

- కాంగ్రెస్ నిర్ణయాన్ని ఖండిస్తూ బీజేపీ తీర్మానం
- జాతీయ గేయం చరిత్ర, వారసత్వంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తామని పార్టీ వెల్లడి
- వందేమాతరం రెండు చరణాలే పాడుతామంటూ కాంగ్రెస్ చేసిన ప్రకటనను ఖండిస్తూ మరో తీర్మానానికి పార్టీ ఆమోదం



## ఈ నెల 31న వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభిస్తాం

- వెలిగొండ నిర్వాసితుల మూడో విడతగా 2,027 కుటుంబాలకు రూ.250 కోట్ల పరిహారం చెల్లింపు
- 3 దశాబ్దాల కల నెరవేరుతున్నందుకు నిర్వాసితులు హర్షం

**అమరావతి**

ఈ నెల 31న వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేస్తామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా వెలిగొండ టన్నెళ్ల నుంచి 10.5 టీఎంసీల కృష్ణా జలాలను నల్లమల సాగర్‌కు విడుదల చేస్తారని చెప్పారు. వెలిగొండ నిర్వాసితులకు మూడో విడతలో భాగంగా 2,027 కుటుంబాలకు రూ.250 కోట్ల పరిహారాన్ని క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు అందజేశారు. అనంతరం మంత్రి నిమ్మల మీడియా తో మాట్లాడారు. వెలిగొండ అన్ని పనులు పూర్తి చేసి - మిగతా3లో

# స్వచ్ఛత మనందరి బాధ్యత

- త్వరలోనే అనకాపల్లి, విశాఖకు గోదావరి నీళ్లు తెస్తాం: సీఎం చంద్రబాబు
- అనకాపల్లి జిల్లాలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు
- అభివృద్ధి అంటే పరిశ్రమలు, పెట్టుబడులు, కంపెనీలే కాదు స్వచ్ఛమైన ప్రాంతాలన్న ముఖ్యమంత్రి
- స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు



**అమరావతి**

విశాఖకు మించి అనకాపల్లికి పెట్టుబడులు వస్తున్నాయని సీఎం చంద్రబాబు అన్నారు. స్టీల్ సిటీ నిర్మాణం కాబోతుందని, భవిష్యత్తులో నాలెడ్జ్ ఎకానమీకి కేంద్రంగా అనకాపల్లి మారబోతుందన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జిల్లా కె.కోటపాడు మండలం ఎ.కోడూరులో పర్యటించిన సీఎం ప్రజావేదికలో మాట్లాడారు. ప్రతి గ్రామం జీరో వేస్ట్ పంచాయతీగా తయారు కావాలన్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్సీపీ పాలనలో రాష్ట్రమంతా చెత్తమయం చేశారని ప్రస్తుతం ఆ చెత్తను తొలగించే పనులు ఊపందుకున్నాయన్నారు. చెత్త నుంచి కంపోస్ట్, కరెంట్, గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. - మిగతా3లో

## న్యాయమూర్తులు దేవుళ్లు కాదు

- ప్రతి తీర్పు సరైనదిగా ఉండకపోవచ్చు
- జస్టిస్ సంజయ్ కరోల్
- వీడ్కోలు ప్రసంగంలో జస్టిస్ సంజయ్ కరోల్ కీలక వ్యాఖ్యలు
- న్యాయమూర్తులు దేవుళ్లు కాదన్న జస్టిస్ సంజయ్
- చట్టాన్ని మాత్రమే కాదని, న్యాయాన్ని కూడా దృష్టిలో పెట్టుకోవాలన్న జస్టిస్ కరోల్

## 'ఇది ఎలాంటి 'ఆత్మనిర్భర్ భారత్'

- పండగ ముందు ప్రజలపై భారం'
- కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే ఫైర్
- చక్కెర ధరలను పెంపుపై ప్రభుత్వంపై మండిపడ్డ కాంగ్రెస్
- పండుగల సీజన్‌కు ముందే సామాన్య ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని ఆరోపణ



## సమాజంలో సమూల మార్పులు విద్యతోనే సాధ్యం

- ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల క్లస్టర్ సమావేశంలో పాల్గొన్న మంత్రి లోకేశ్
- మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనా పద్ధతులను మార్చుకోవాలని సూచన
- ప్రతీ ఉపాధ్యాయుడు ఏఐపై అవగాహన పెంచుకోవాలని వ్యాఖ్య



**అమరావతి**

సమాజంలో మనం కోరుకున్న సమూల మార్పులు ఒక్క విద్యతోనే సాధ్యమవుతాయని విద్యాశాఖ మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. అందుకే తాను కీలకమైన విద్యాశాఖ బాధ్యతలు స్వీకరించానని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనా పద్ధతులను మార్చుకోవాలన్నారు. విజయనగరం జిల్లా దాసన్నపేటలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యావ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న కీలక నిర్ణయాలను లోకేశ్? వివరించారు. ప్రతీ ఉపాధ్యాయుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్? పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలన్నారు. తాను కూడా విద్యాశాఖ సమర్థ నిర్వహణకు ఏఐపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకుంటున్నట్లు తెలిపారు. - మిగతా3లో



# లోకల్ పోల్స్ కోసం జనసేన ప్లాన్

- స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కీలక వ్యాఖ్యలు
- 2024 సార్వత్రిక ఎన్నికల్లో 21 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైన వ్యూహం కేవలం ఆ ఎన్నికలకే వర్తిస్తుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం అదే ఫార్ములా ఉండబోదు
- ప్రాంతాలవారీ రాజకీయ, సామాజిక సమీకరణాల ఆధారంగా జనసేన వ్యూహం స్వతంత్రంగా, ప్రభావశీలంగా ఉంటుందని స్పష్టం
- ఐదేళ్ల పాటు పార్టీ కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన జనసైనికులు, వీర మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేలా రాబోయే స్థానిక ఎన్నికల్లో అడుగులు వేయాలని పవన్ పిలుపు

**విజయవాడ**

ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పార్టీ నాయకత్వానికి, ఎమ్మెల్యేలకు అత్యంత స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన జనసేన లెజిస్లేటివ్ పార్టీ సమావేశంలో పాల్గొన్న ఆయన, స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కీలక వ్యాఖ్యలు చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో 21 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైన వ్యూహం కేవలం ఆ ఎన్నికలకే వర్తిస్తుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం అదే ఫార్ములా ఉండబోదని తేల్చిచెప్పారు. ప్రాంతాలవారీ రాజకీయ, సామాజిక సమీకరణాల ఆధారం గా జనసేన వ్యూహం స్వతంత్రంగా, ప్రభావశీలంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఐదేళ్ల పాటు పార్టీ కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన జనసైనికులు, వీర మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేలా రాబోయే స్థానిక ఎన్నికల్లో అడుగులు వేయాలని పవన్ పిలుపునిచ్చారు. 2021 స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అరాచకాలను ఎదిరించి జనసేన కార్యకర్తలు ధైర్యంగా నిలబడ్డ విషయాన్ని, అలాగే 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి చారిత్రాత్మక విజయానికి క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు చేసిన అసమాన కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. పార్టీ కోసం నిలబడిన ప్రతి కార్యకర్త రాజకీయ బలోపేతమే లక్ష్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేనకు మెరుగైన అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. స్థానిక ఎన్నికల విధివిధానాల రూపకల్పన కోసం 9 నుంచి 11 మంది ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు అధినేత ప్రకటించారు. నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసి, జనసేన పోటీ చేయడానికి తగిన - మిగతా3లో

# అసెంబ్లీ బహిష్కరణ మైలేజ్.. డ్యామేజా...

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీసుకున్న తాజా నిర్ణయం మరోసారి చర్చకు దారితీసింది. రాష్ట్ర అసెంబ్లీ వర్షాకాల సమావేశాలకు పార్టీ ఎమ్మెల్యేలు హాజరు కాకూడదని నిర్ణయించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల తర్వాత సభలో తమకు దక్కాల్సిన ప్రతిపక్ష హోదా విషయంలో న్యాయం జరగలేదన్నది వైసీపీ ప్రధాన వాదనగా ఉంది. ఈ అంశాన్నే కేంద్రంగా చేసుకుని అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండాలని పార్టీ నిర్ణయించింది.2024 ఎన్నికల్లో వైసీపీకి 11 అసెంబ్లీ స్థానాలు మాత్రమే దక్కాయి. కూటమి పార్టీలైన తెలుగుదేశం పార్టీ , జనసేన , బీజేపీ కలిసి భారీ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. దీంతో శాసనసభలో వైసీపీ సంఖ్యాబలం గణనీయంగా తగ్గిపోయింది. ఎన్నికల ఫలితాల తర్వాత నుంచే ప్రతిపక్ష హోదా అంశం ఆ పార్టీ రాజకీయ చర్చలో కీలకంగా మారింది.వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సభలో తమ పార్టీకి తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని పలుమార్లు ఆరోపించారు. మరోవైపు ప్రభుత్వం, కూటమి నేతలు మాత్రం ప్రతిపక్ష హోదాకు సంబంధించిన నిబంధనలు, సభలో పార్టీ బలాన్ని ప్రస్తావిస్తూ వైసీపీ వాదనను అంగీకరించడం లేదు. దీంతో రెండు వైపులా రాజకీయ విమర్శలు కొనసాగుతున్నాయి.అయితే అసెంబ్లీకి వెళ్లకుండా ఉండటం వల్ల వైసీపీకి రాజకీయంగా ఎంత మేరకు ప్రయోజనం కలుగుతుందన్నది ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది. ప్రజల సమస్యలను నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు శాసనసభ ఒక ముఖ్యమైన వేదిక. నిరుద్యోగం, రైతుల సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ధరల పెరుగుదల, అభివృద్ధి కార్యక్రమాలు వంటి అంశాలపై అధికార పక్షాన్ని ప్రశ్నించే అవకాశం ప్రతిపక్ష సభ్యులకు ఉంటుంది. అలాంటి అవకాశాన్ని స్వయంగా వదులుకోవడం వల్ల పార్టీకి నష్టం జరిగే ప్రమాదం ఉందనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి.మరోవైపు వైసీపీ తన రాజకీయ పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తోంది. అసెంబ్లీకి గైర్హాజరైనప్పటికీ పార్టీ నాయకులు, కార్యకర్తల ద్వారా ప్రభుత్వ నిర్ణయాలను విమర్శించడం, ప్రజా సమస్యలను ప్రస్తావించడం కొనసాగించవచ్చు. సోషల్ మీడియా, బహిరంగ కార్యక్రమాలు, పార్టీ సమావేశాలను ఇందుకు ఉపయోగించుకునే అవకాశం ఉందిశాసనమండలిలో మాత్రం వైసీపీకి కొంత బలం ఉండటంతో అక్కడి వేదికను ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు ఉపయోగించుకోవాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఒకవైపు అసెంబ్లీకి దూరంగా ఉంటూ, మరోవైపు మండలిలో ప్రభుత్వాన్ని నిలదీయడం అనే ద్వంద్వ వ్యూహం ఆసక్తిని కలిగిస్తోంది.ఇక వరుసగా సభకు గైర్హాజరైతే సభ్యుల హాజరుకు సంబంధించిన రాజ్యాంగ నిబంధనలు కూడా ప్రస్తావనకు వస్తున్నాయి. అయితే గైర్హాజరుపై అనుమతులు, సభా విధానాలు వంటి అంశాలు కూడా ఇందులో కీలకంగా ఉంటాయి. కాబట్టి కేవలం గైర్హాజరు ఆధారంగా సభ్యత్వంపై తక్షణ నిర్ణయం వస్తుందని భావించడం సరికాదు.మొత్తానికి వైసీపీ అసెంబ్లీ బహిష్కరణ నిర్ణయం ఆ పార్టీ రాజకీయ వ్యూహానికి పరీక్షగా మారింది. ప్రతిపక్ష హోదా అంశాన్ని ప్రజల్లోకి ఎంత బలంగా తీసుకెళ్తుంది, అసెంబ్లీకి దూరంగా ఉండటం వల్ల రాజకీయం గా లాభమా నష్టమా అన్నది కాలమే తేల్చనుంది. ప్రజా సమస్యలపై పోరాటానికి సభా వేదికను ఎంచుకుంటుందా, లేక బయట నుంచే ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగిస్తుందా అనేది రాబోయే రోజుల్లో ఆసక్తికరంగా మారనుంది.



### వైసీపీ రికార్డు

చట్ట సభలే ప్రజాస్వామ్య వేదికలు. అక్కడ అన్ని పక్షాలు కలిసి ప్రజా సమస్యల మీద చర్చిస్తాయి. అలాంటి వేదికలను బహిష్కరించడం అన్నది తొలి తరంలో జరిగేది కాదు, అసలు వాకౌట్లు కూడా అప్పట్లో తక్కువగా ఉండేవి. అయితే రాను రానూ రాజకీయం పెరిగి సభలకే డుమ్మా కొడుతున్నారు. ఇక దేశంలో శాసనసభ మొత్తాన్ని లేదా సమావేశాలను ఒక నిర్దిష్ట రాజకీయ పార్టీ పూర్తిగా బహిష్కరించడం అనేది ఎక్కడా లేదని అంటున్నారు. అదే సమయంలో ఇది రాష్ట్రాల వారీగా అక్కడి రాజకీయ పరిస్థితులు అధికార ప్రతిపక్షాల మధ్య వివాదాలు లేదా సభలో తమకు సముచిత గౌరవం దక్కలేదనే కారణాలపై ఈ బహిష్కరణలు ఆధారపడి ఉంటాయి. మరో వైపు చూస్తే భారతదేశంలో అసెంబ్లీలను బహిష్కరించే పార్టీలు ఉన్నా పాక్షికంగా పరిమితంగా జరిగిన సందర్భాలు ఉన్నాయని అంటున్నారు. కొన్ని సందర్భాలలో ప్రతిపక్ష పార్టీలు నిరసనగా సభలకు దూరంగా ఉంటూ వచ్చిన నేపథ్యం ఉంది. అయితే ఒక ప్రధాన ప్రతిపక్ష పార్టీ మొత్తం అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉండటాన్ని ప్రజాస్వామ్య వ్యవస్థలో బాధ్యతారాహిత్యంగా అధికార పార్టీలు విమర్శిస్తుంటాయి. సభలో చర్చల ద్వారానే ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, బహిష్కరణలు సరైనవి కాదని రాజకీయ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతుంటారు. ఏపీలో చూస్తే మూడు సందర్భాలలో ముగ్గురు నాయకులు అసెంబ్లీ బహిష్కరణ పిలుపు ఇచ్చారు. వారే ఎన్టీఆర్, జగన్ చంద్రబాబుగా చెప్పాలి మూడున్నర దశాబ్దాల క్రితం చూస్తే ఎన్టీఆర్ 1989లో విపక్షంలో ఉన్నారు. అయితే ఆయన పార్టీకి చెందిన వారు అంతా సభకు హాజరయ్యారు. అప్పట్లో ఉప నాయకులుగా చంద్రబాబు ఇతర నేతలు కలసి టీడీపీని అసెంబ్లీలో నడిపించారు. ఇక జగన్ అయితే 2017లో అసెంబ్లీకి రావడం లేదని ఒక దండం పెట్టి మరీ జనంలోకి పాదయాత్ర కోసం వెళ్ళారు. అయితే జగన్ అప్పటికి మూడేళ్ళ పాటు అసెంబ్లీకి హాజరయ్యేవారు. చంద్రబాబు విషయం తీసుకుంటే ఆయన 2021లో వైసీపీ ప్రభుత్వ హయాంలో సభలో తనకు అవమానం జరిగిందంటూ చంద్రబాబు అసెంబ్లీని బహిష్కరించి మళ్లీ అధికారంలోకి వస్తేనే అసెంబ్లీలో అడుగుపెడతానని శపథం చేసి వెలువడిన సందర్భాన్ని రాజకీయ ప్రత్యర్థులు ప్రస్తావిస్తుంటారు ఇక అసెంబ్లీలను బహిష్కరించడం అన్న దానికి బీజం తమిళనాడులో జయలలిత హయాంలో పడింది అని చెప్పాల్సి ఉంటుంది. 1989 మార్చి 25న తమిళనాడు అసెంబ్లీలో జరిగిన ఘోర అవమానం కారణంగా ప్రతిపక్ష నేతగా ఉన్న జయలలిత సభను బహిష్కరించారు. డీఎంకే సభ్యుల దాడిలో అవమానానికి గురైన ఆమెమళ్ళీ ముఖ్యమంత్రిగా అడుగుపెడతాను అని భీష్మ ప్రతిజ్ఞ చేసి సభను వీడారు. ఈ సంఘటన ఆమె రాజకీయ జీవితంలో ఒక కీలక మలుపుగా నిలిచింది. ప్రజల్లో ఆమెకు సానుభూతి పెరిగింది. సరిగ్గా రెండేళ్ల తర్వాత 1991 ఎన్నికల్లో అఖండ విజయం సాధించి, తాను అనుకున్నట్టుగానే తమిళనాడు తొలి మహిళా పూర్తికాల ముఖ్యమంత్రిగా ఘనంగా అసెంబ్లీలో అడుగుపెట్టారు అయితే వైసీపీ మాత్రం 2024లో కొత్త అసెంబ్లీ ఏర్పాటు అయ్యాక అసెంబ్లీకి వెళ్ళడం మానుకుంది. ఆ పార్టీ తనకు 11 సీట్లు వచ్చినా ప్రధాన ప్రతిపక్ష పాత్ర కోరుతోంది. అయితే రూల్స్ మాత్రం అందుకు ఒప్పుకోవని స్పీకర్ ఆఫీసు చెబుతోంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీకి వైసీపీ దూరంగా ఉంటోంది. ఇప్పటికి 26 నెలలు గడచిపోయినా వైసీపీ అసెంబ్లీ వైపు చూడడం లేదు, దీని మీద ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా విమర్శలు చేశారు. ప్రజాస్వామ్యంలో అసెంబ్లీని ప్రతిపక్షాలు బహిష్కరించడం సరికాదని అన్నారు. ప్రజా సమస్యలపై సభలోనే తేల్చుకోవాలని ఆయన అన్నారు. వైసీపీ తీరును తప్పుపడుతూ తన రాజకీయ జీవితం మొత్తంలో ఇలాంటివి చూడలేదని అన్నారు. దేశంలో కూడా ఈ రకమైన పరిణామాలు ఎక్కడైనా జరిగాయో లేవో కానీ ఈ విషయంలో వైసీపీది కొత్త రికార్డు అని ప్రత్యర్థులు విమర్శిస్తున్నారు.

## లోకల్ ఎన్నికలు కొంపముంచాతాయా? ఏంటి?

**నెల్లూరు :** ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకంతో పాటు ఎంతో సవాల్ గా మారనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు గ్రామం నుంచి మున్సిపల్ స్థాయి వరకు పార్టీ యంత్రాగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు కావస్తుంది. కార్యకర్తల్లో ఎన్నికలకు ముందు ఉత్సాహం లేదు. పదవులు లేవు. వారికి సరైన పనులు దక్కడం లేదు. ఇప్పటికీ అనేక నియోజకవర్గాల్లో వైసీపీ నేతలదే పెత్తనమని కార్యకర్తల నుంచి ద్వితీయ శ్రేణి నేతల వరకూ భావిస్తున్నారు. వీరు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంత మేరకు కమిట్ మెంట్ తో పనిచేస్తారన్నది మాత్రం లోలోపల పార్టీ నేతలకు కూడా సందేహంగానే కనిపిస్తుంది.. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాకముందు ఒకలా... వచ్చిన తర్వాత మరొకలా వ్యవహరిస్తుంది. గత సాధారణ ఎన్నికల్లో ప్రాణాలకు తెగించి పోలింగ్ కేంద్రాల వద్ద కార్యకర్తలు పోరాడారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా పార్టీ అగ్రనాయకత్వం హెచ్చరికలు చేస్తున్నా అత్యధిక సంఖ్యలో ఉన్న టీడీపీ శాసనసభ్యులు తమకు ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చే వారికే పనులు కట్టబెడుతున్నారు కానీ, పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తల కష్టాన్ని మాత్రం గుర్తించడం లేదన్న అభిప్రాయం ఉంది. అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు ఒరిగిన ప్రయోజనమేమీ లేదని బహిరంగంగానే పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియా ద్వారా వాపోతున్నారు. కానీ వారి గోడును మాత్రం పట్టించుకోవడం లేదు. కూటమి నేతల మధ్య సయోధ్య లేకపోవడం కూడా మరొక తలనొప్పిగా తయారు కావచ్చు.. మరొకవైపు ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాలను కూడా చూసీ చూడనట్లు పార్టీ నాయకత్వం వదిలేస్తుండటాన్ని కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారు. టీడీపీకి బూత్ లెవెల్ లో భారీ బలగం ఉన్నప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంత మేరకు కసి తీరా పనిచేస్తుందన్నది మాత్రం సందేహంగానే ఉంది. మరొకవైపు ప్రత్యక్ష ఎన్నికల విధానం కూడా పార్టీకి నష్టం తెచ్చి పెడుతుందని అంటున్నారు. బీసీ నినాదం ఎత్తుకున్నా అవి న్యాయస్థానాలు ఎంత మేరకు అంగీకరిస్తాయన్నది కూడా అనుమానమే. ఇప్పటికే రిజర్వేషన్లపై హైకోర్టు చేసిన వ్యాఖ్యలు చూస్తే 34 శాతం బీసీ రిజర్వేషన్లతో ఈ ఎన్నికలకు వెళ్లే అవకాశాలు కనిపించడం లే?. స్థానిక సంస్థల్లో 34శాతం బీసీ రిజర్వేషన్ల అమలును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నప్పటికీ, న్యాయపరమైన చిక్కులు రాకుండా ఎన్నికలు నిర్వహించడం ప్రభుత్వానికి పెద్ద సవాల్. అయితే 16వ ఆర్థిక సంఘం నిధులను పొందడానికి, సకాలంలో స్థానిక సంస్థల పాలనను పునరుద్ధరించడం కోసం ఎన్నికలు నిర్వహించడం అవసరం. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలు టీడీపీకి ఛాలెంజ్ అనే చెప్పాలి.

## ఎప్పూడూ ఆ నియోజకవర్గం రాజకీయమే

**అనంతపురం :** రాష్ట్రంలో వైసీపీ వర్సెస్ టీడీపీ, జనసేన అనేలా చాలా నియోజకవర్గాలు ఉన్నాయి. కానీ, ఓ నియోజకవర్గంలో మాత్రం 'అంతకుమించి' అన్నట్టుగా ఇరు పక్షాల మధ్య ముఖ్యంగా స్థానిక నేతల మధ్య రాజకీయాలు రగులుతున్నాయి.



నానాటికీ ఈ రాజకీయ వ్యూహాలు.. పెరుగుతూనే ఉన్నాయి. అదే...ఉమ్మడి అనంతపురం జిల్లాలోని తాడిపత్రి నియోజకవర్గం. ఇక్కడ జేసీ వర్సెస్ పెద్దారెడ్డి మధ్య రాజకీయాలు నిరంతరం నిప్పులు చెరుగుతూనే ఉన్నాయి ఇతర నియోజకవర్గాల్లోనూ వైసీపీ వర్సెస్ టీడీపీ అన్నట్టుగా రాజకీయాలు ఉన్నప్పటికీ.. ఇక్కడ మరింత భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. వైసీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని నియోజకవర్గంలోకి రాకుండా అడ్డుకుంటామని.. ఆయన నియోజకవర్గంలో అడుగు పెట్టేది కూడా లేదని శపథం చేసిన టీడీపీ సీనియర్ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి అలానే వ్యవహరిస్తున్నారు. గత రెండున్నరేళ్లుగా రాష్ట్రంలో రగులుతున్న ఏకైక నియోజకవ ర్గం కూడా ఇదే కావడం గమనార్హం... నియోజకవర్గంలో అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం ఎక్కడైనా ఉంటుంది. తాడిపత్రిలో మాత్రం రాజకీయాలకు ఇస్తున్న ప్రాధాన్యం వైసీపీ హయాంలోను.. ప్రస్తుత కూటమి హయాంలోనూ అభివృద్ధిని మించి ఉంటోందన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. యువ ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నా.. రాజకీయంగా జేసే వేస్తున్న అడుగుల కారణంగా.. అభివృద్ధిపై పెద్దగా చర్చ జరగడం లేదు. గత వైసీపీ దెబ్బతిన్నది కూడా ఇక్కడే. ముందుగా అభివృద్ధిపై ప్రచారం ఎక్కువగా ఉంటే.. అది అల్టిమేట్‌గా పార్టీలకు కలిసి వస్తుంది. అన్నట్టుగా తాడిపత్రి నియోజకవర్గం మారిపోవడం గమనార్హం. సహజంగా ఎన్ని కలకు ముందు రాజకీయాలు ఉంటాయి. కానీ, వైసీపీ వర్సెస్ టీడీపీ మధ్య ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యేల మధ్య వ్యక్తిగత అంశాలు ఎక్కువగా ప్రభావం చూపుతున్నాయి. దీనిని ప్రజలు ఎలా రిసీవ్ చేసుకుంటారు? అనే అంశంపైనే తాడిపత్రి నియోజకవర్గం భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అంతకు మించి.. వ్యక్తిగత దూకుడును ప్రజలు అర్థం చేసుకుంటారా.. లేదా? అనేది చూడాలి. ప్రస్తుతం అయితే.. జేసీ హవా ఓ రేంజ్ లో సాగుతోందన్నది వాస్తవం.

## సమాజంలో సమూల మార్పులు విద్యతోనే సాధ్యం

-మొదటిపేజీ తరువాయి

ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 10,000 పాఠశాలల్లో 'వన్ క్లాస్ – వన్ టీచర్' విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చామని వెల్లడించారు. 'ప్రభుత్వ పాఠశాలల్లో అధికంగా ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులే చదువుకుంటారు. వారిపై ఉపాధ్యాయులు మరింత ఆప్యాయత, శ్రద్ధ చూపాలి. చదువులో వెనుకబడిన పిల్లలను ప్రోత్సహించి ముందుకు నడిపించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం. నేటి సమాజంలో విద్యార్థుల్లో పెరుగుతున్న చెడు వ్యసనాలను కట్టడి చేయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలి. అదేవిధంగా ఈ సమస్య పరిష్కారానికి 'ఈగల్ క్లబ్' కీలక పాత్ర పోషిస్తుంది.ఇటీవల విశాఖలో ఓ విద్యార్థి మృతిచెందడం ఎంతో బాధాకరమని' లోకేశ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా పలువురు ఉపాధ్యాయులతో లోకేశ్ నేరుగా మాట్లాడారు. బోధనలో వారు అనుసరిస్తున్న ఉత్తమ పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక వారి సమస్యలు, సూచనలను స్వీకరించారు. విద్యావ్యవస్థ మెరుగుదల కోసం ప్రతి నెలా ఈ క్లస్టర్ సమావేశంలో తాను స్వయంగా పాల్గొంటానని హామీ ఇచ్చారు. లోపాలను సరి చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని ఆయన చెప్పారు. అంతకుముందు, విజయనగరం వై జంక్షన్ వద్దకు చేరుకున్న లోకేశ్‌కు మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మరియు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. డప్పుల దరువులతో, వివిధ రకాల జానపద కళారూపాలతో ఆయనకు స్వాగతం పలికారు. లోకేశ్‌ను చూసేందుకు విజయనగరానికి చెందిన మోహన్?రావు అనే ఓ టీడీపీ కార్యకర్త సైకిల్?పై వచ్చాడు. ఈ సందర్భంగా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. గర్ల్స్ స్కూల్ వద్ద లోకేశ్?తో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించిన ఆయన ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశీర్వదించారు.

## స్వచ్ఛత మనందరి బాధ్యత

-మొదటిపేజీ తరువాయి

ప్రతి గ్రామానికి స్వచ్ఛ రథాలను పంపుతున్నామన్నారు. ఇంట్లోని చెత్త ఇస్తే బదులుగా మరొకటి ఇస్తారన్నారు. అభివృద్ధి అంటే పరిశ్రమలు, పెట్టుబడులు, కంపెనీలే కాదని స్వచ్ఛమైన ప్రాంతాలని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛత, పరిశుభ్రత కోసం ఆలోచించాలని సూచించారు. స్వచ్ఛత కోసం ముందుకొస్తున్న ప్రతిఒక్కరినీ అభినందిస్తున్నామన్నారు. మన ఊరు – మన బాధ్యత సంకల్పం అందరూ తీసుకోవాలన్నారు. మన ఇల్లు, వీధి, కార్యాలయం, బహిరంగ ప్రదేశాలు అన్నీ పరిశుభ్రంగా ఉండాలని తెలిపారు. ఆరోగ్యకర జీవనానికి స్వచ్ఛత మరింత అవసరం సీఎం చంద్రబాబు అన్నారు.

త్వరలోనే అనకాపల్లి, విశాఖకు గోదావరి నీళ్లు తెస్తామన్నారు. అనకాపల్లి జిల్లాలోని ప్రతి చెరువు, రిజర్వాయర్ నింపే బాధ్యత తమదని, సెప్టెంబర్ తొలి వారంలోనే అనకాపల్లికి నీళ్లు తెచ్చి చూపిస్తామని స్పష్టం చేశారు. క్వాంటం కంప్యూటర్ మన దేశానికి వస్తోందని సీఎం చంద్రబాబు వివరించారు. అమరావతి రావడం గర్వంగా భావిస్తున్నామన్నారు.

ఇంటిపై సోలార్ ప్యానెల్ పెట్టుకుంటే ఒక్క రూపాయి ఖర్చు ఉండదని సూచించారు. ఆడబిడ్డల కోసం 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నారు. రాబోయే రోజుల్లో 3 గ్యాస్ సిలిండర్ల డబ్బులు 4 నెలలకోసారి జమ చేస్తామన్నారు. ఇండక్షన్ స్టవ్‌లు పెట్టుకుంటే గ్యాస్‌తో కూడా అంత పని ఉండదని వివరించారు. 2047కు మోదీ నాయకత్వంలో దేశం అగ్రదేశంగా వికసిత్ భారత్ వెలుగొందుతుందన్నారు. 2047కు తలసరి ఆదాయం రూ.50 లక్షల వరకు పెరిగే అవకాశం ఉందని సీఎం చంద్రబాబు వివరించారు. 'డేటా సెంటర్ వస్తే లక్షల మందికి మంచి ఉద్యోగాలు వస్తాయి. ఆదాయం కూడా ఆకాశమే హద్దుగా ఉండబోతుంది. మంచి పనులు చేస్తుంటే అడ్డుకోవడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారు. గూగుల్ డేటా సెంటర్ కోసం సుందరమైన విశాఖకు వచ్చారని వేరే రాష్ట్రాలు ఆశ్చర్యపోతే ఇక్కడుండే వాళ్లు కొద్దిమంది జెండాలు పట్టుకుంటారన్నారు. ఇంతవరకూ డేటా సెంటర్ ప్రారంభం కాలేదు అప్పుడే నీళ్లు ఇంకిపోయాయంటారు. తాగడానికి నీళ్లు లేవంటూ దుష్ప్రచారం ప్రారంభించారు.'

## ఈ నెల 31న వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభిస్తాం

-మొదటిపేజీ తరువాయి

, నిర్వాసితులకు పరిహారం చెల్లించిన తర్వాతే ప్రాజెక్టును ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. పూర్తికాని వెలిగొండను పూర్తయినట్లు జగన్ జాతికి అంకితం చేయడం ప్రపంచంలోనే ఎనిమిదో వింత అని విమర్శించారు.

### 3 దశాబ్దాల కల

నిర్వాసితులకు చెల్లించాల్సిన రూ.900 కోట్ల పరిహారంలో జగన్ ప్రభుత్వం పైసా కూడా చెల్లించలేదని ఆరోపించారు. నిర్వాసితులను మోసం చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని దుయ్యబట్టారు. ప్రాజెక్టు పనులతో పాటు నిర్వాసితుల సంక్షేమానికీ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. మొత్తం 7 నిర్వాసిత కాలనీల్లో 4 కాలనీల్లో 100 శాతం మౌలిక వసతులు పూర్తయ్యాయని, మిగిలిన 3 కాలనీల్లో పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని చెప్పారు. కరువు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు వెలిగొండ వరమని, 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుతుందని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. 3 దశాబ్దాల కల నెరవేరుతున్నందుకు నిర్వాసితులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ చర్యల్ని వారు స్వాగతించారు. 'మా ముప్పై ఏళ్ల కల ఇప్పుడు నెరవేరుతోంది. మంత్రి నిమ్మల రామానాయుడు అపర భగీరథుడిలా ప్రయత్నం చేసి మాకు అండగా నిలబడ్డారు. ఆయన కృషి వల్లే వెలిగొండ పూర్తయ్యింది. ప్రతీ నిర్వాసితుడికి ఆర్‌అండ్ ఆర్ సొమ్ము జమ చేశారు. మాకు చాలా సంతోషంగా ఉంది. కూటమి ప్రభుత్వం మాకు అన్ని వేళలా అండగా ఉంది.' 40 రోజుల్లో 3 విడతలుగా రూ. 768 కోట్లు నిర్వాసుల ఖాతాల్లో వేశాం. వెలిగొండ ప్రాజెక్ట్ అందుబాటులోకి రావడంతో పాటు దీనికోసం భూములిచ్చిన, ఆస్తులు కోల్పోయిన వారికి న్యాయం చెయ్యడానికి సమ ప్రాధాన్యం ఇచ్చాం. ఈ మేరకు సీఎం చంద్రబాబు సంకల్పించారు. ఆఖరి నిర్వాసితుడి వరకూ ప్రతీ పైసా చెల్లించేలా నేను బాధ్యత తీసుకుంటాను.'

## లోకల్ పోల్స్ కోసం జనసేన ప్లాన్

-మొదటిపేజీ తరువాయి

స్థానాలు, పట్టున్న ప్రాంతాలను గుర్తించి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యేలను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో జనసేన శ్రేణుల మనోభావాలు, స్థానిక రాజకీయ వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాతే సీట్ల కేటాయింపు, అభ్యర్థుల ఎంపికపై నిర్ణయాలు ఉంటాయని తెలిపారు.ఇదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో కూటమి ధర్మానికి భిన్నంగా జరుగుతున్న పరిణామాలు, జనసేన శ్రేణుల అసంతృప్తిపై సమావేశంలో ఎమ్మెల్యేలు పార్టీ చీఫ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన పవన్.. కార్యకర్తల మనోభావాలు, అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ఐక్యతను కాపాడుకుంటూనే, జనసేన బలం ఉన్న ప్రతిచోటా గౌరవప్రదమైన ప్రాతినిధ్యం దక్కేలా చూస్తామని, రాబోయే స్థానిక ఎన్నికల్లో జనసేన తన సత్తా చాటుతుందని పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపారు.

### జనసేన కేడర లో కొత్త జోష్

జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ పెట్టారు. ఈసారి రాజీ పడకూడదని నిర్ణయించుకున్నట్లు ఆయన మాటలను బట్టి తెలుస్తోంది. కూటమిలో పొత్తుకు భంగం కలగకుండా, తమకు నష్టం జరగకుండా స్థానాలను తీసుకోవాలని పవన్ కల్యాణ్ నిర్ణయించుకున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. ఇదే అభిప్రాయాన్ని త్వరలో చంద్రబాబు నాయుడు ముందు కూడా ఉంచనున్నారు. శాసనసభ ఎన్నికల తరహాలో తమ పార్టీకి తక్కువ స్థానాలు ఇవ్వాలన్న ఆలోచన ఉంటే వాటిని సరిచేసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించనున్నారు. ఈ మేరకు జనసేన పార్టీ ఎమ్మెల్యేలకు పవన్ కల్యాణ్ స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. 21 స్థానాల్లో పోటీ చేయడం అనేది అప్పటి పరిస్థితుల వరకే.. స్థానిక సంస్థల ఎన్నికల్లో సార్వత్రిక ఎన్నికల వ్యూహం వర్తించదు.. జనసైనికులు, వీర మహిళల ఆత్మగౌరవం కాపాడుతామని పవన్ కల్యాణ్ అనడం చర్చనీయాంశమైంది.. త్వరలోనే కమిటీలను నియమించి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని కూడా పవన్ నిర్ణయించారు. జనసేన శాసనసభ పక్ష సమావేశంలో పవన్ కల్యాణ్ ఈ వ్యాఖ్యలు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై లోతుగా చర్చించామని పవన్ కల్యాణ్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసైనికుల పోరాట స్ఫూర్తిని కొనసాగించేలా, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా ముందుకు తీసుకువెళ్తామని పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేలకు చెప్పారు. నేడు కేరళం కు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెళ్లనున్నారు. నేటి నుంచి 20 రోజులపాటు కేరళంలోని ప్రకృతి వైద్య చికిత్సా కేంద్రంలో ఉండనున్న పవన్ చికిత్స చేయించుకోనున్నారు.

# జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా రాచవీటి మారన్న

## -ఏకగ్రీవంగా ఎంపిక.. 34 ఏళ్ల సేవకు గుర్తింపు



వేంపల్లె ఆగస్టు 22 (కదిలించే వార్త):

వైఎస్సార్ కడప జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా వేంపల్లెకు చెందిన రాచవీటి మారన్న ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ విషయాన్ని యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అవినాష్, రాయలసీమ యోగా స్పోర్ట్స్ ఇన్‌చార్జి మనోహర్‌రెడ్డి వెల్లడించారు. రాచవీటి మారన్న ఎంపిక పట్ల జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మారం శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి తేజ, జాయింట్ సెక్రటరీ షఫీ, ఈసీ సభ్యులు శ్రీరాములురెడ్డి, రాజు తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.రాచవీటి మారన్న శ్రీ గండి వీరాంజనేయ స్వామి దేవస్థానంలో 34 సంవత్సరాల పాటు సేవలందించి, కొన్ని నెలల క్రితం జూనియర్ అసిస్టెంట్‌గా పదవీ విరమణ పొందారు. ఆలయ సేవలతో పాటు యోగా, క్రీడా రంగాల పట్ల ఆయనకు ఉన్న ఆసక్తి, అనుభవాన్ని గుర్తించి జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్‌లో కీలక బాధ్యత అప్పగించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.జిల్లాలో యోగా క్రీడల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తన వంతు కృషి చేస్తానని రాచవీటి మారన్న తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.మారన్న ఎంపిక పట్ల యోగా గురువులు, క్రీడాకారులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# రోడ్డు విస్తరణకు అడ్డుగా పాత లారీ!

## -అధికారుల సమన్వయ లోపంతో పనులకు ఆటంకం

## -వెంటనే తొలగించాలని ప్రజల డిమాండ్



వేంపల్లె, ఆగస్టు 22 (కదిలించే వార్త):

వేంపల్లె మేజర్ పంచాయతీ పరిధిలో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులకు ఉన్న ఆటంకాలను వెంటనే తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. నాలుగు రోడ్ల కూడలి నుంచి ఆంజనేయస్వామి సర్కిల్ వరకు విస్తరణ పనులు కొనసాగుతున్నప్పటికీ, పోలీస్‌స్టేషన్ సమీపంలో రోడ్డుపై నిలిపివుంచిన పాత లారీని తొలగించకపోవడంతో పనులు నిలిచిపోయాయని మాజీ వార్డు సభ్యుడు అంజి తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఒకవైపు పనులను పూర్తిస్థాయిలో ముగించాల్సి ఉండగా, ఈ పాత లారీ అడ్డుగా ఉండటంతో పనులకు తీవ్ర విఘాతం కలుగుతోందన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే పోలీస్, ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.ఇటీవల జిల్లా ఎస్పీని విలేకరులు ప్రశ్నించినప్పుడు లారీని తప్పకుండా తొలగిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటికీ అది అక్కడే ఉండటం అధికారుల మధ్య సమన్వయ లోపానికి నిదర్శనమని పేర్కొన్నారు.

### అసంపూర్తి పనులతో ప్రయాణికుల నరకయాతన

ఒకవైపు పనులు పూర్తికాకముందే మరోవైపు పనులు ప్రారంభించడంతో వాహనదారులు, పాఠశాల విద్యార్థులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అంజి వాపోయారు. పనుల సమయంలో ట్రాఫిక్ నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి పనులు ఆలస్యం కాకుండా రోడ్డుపై ఉన్న లారీని వెంటనే తొలగించి, ఒకవైపు పనులను పూర్తిగా ముగించిన తర్వాతే మరోవైపు పనులు ప్రారంభించాలని అధికారులను డిమాండ్ చేశారు.

# బీజేపీ భౌతిక దాడులు ఖండనార్హం

## -ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలకు అవకాశం ఇవ్వాలి:

## - డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి



వేంపల్లె, ఆగస్టు 22 (కదిలించే వార్త):

రాజస్థాన్‌లో కాక్రోచ్ జనతా పార్టీ కార్యకర్తలపై బీజేపీ శ్రేణులు భౌతిక దాడులకు పాల్పడినట్లు వచ్చిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు.శనివారం వేంపల్లెలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'స్కూల్ టీక్ కరో' కార్యక్రమంలో భాగంగా కాక్రోచ్ జనతా పార్టీ సహ వ్యవస్థాపక అధ్యక్షుడు అశుతోష్ రంకా నేతృత్వంలోని బృందం రాజస్థాన్‌లోని జైపూర్ పరిధిలో రాంపురా--కన్వార్‌పురా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను పరిశీలించేందుకు వెళ్లిన సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలిపారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు దాడి చేయడం, దుస్తులు చింపడం, వాహనాలు, మొబైల్ ఫోన్లు ధ్వంసం చేయడం, మహిళలపై బురద చల్లడం, అసభ్య పదజాలంతో దూషించడం వంటి చర్యలు జరిగాయని ఆయన ఆరోపించారు. ఈ ఘటనలో ఒకరికి చేయి విరిగినట్లు తెలిపారు.ప్రజాస్వామ్యంలో ప్రతి రాజకీయ పార్టీకి, ప్రజా సంఘాలకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉందని, భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని తులసిరెడ్డి పేర్కొన్నారు. ఇటువంటి చర్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు.

### ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి

### రూ.8,500 కోట్ల బకాయిలతో విద్యార్థులు, కళాశాలలపై తీవ్ర ప్రభావం:

పేద విద్యార్థులు సైతం ఉన్నత విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2008--09 విద్యా సంవత్సరం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాలను అమలు చేసిందని తులసిరెడ్డి తెలిపారు. ఈ పథకాల ద్వారా ఎంతోమంది పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు.తరువాత వైసీపీ ప్రభుత్వం ఈ పథకాలకు విద్యా దీవెన, వసతి దీవెన పేర్లు పెట్టిందని తెలిపారు. అయితే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ పథకాలను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద త్రైమాసికానికి రూ.700 కోట్ల చొప్పున తొమ్మిది త్రైమాసికాలకు రూ.6,300 కోట్లు, స్కాలర్‌షిప్ పథకం కింద ఏడాదికి రూ.1,100 కోట్ల చొప్పున రెండేళ్లకు రూ.2,200 కోట్లు కలిపి మొత్తం రూ.8,500 కోట్ల బకాయిలు ఉన్నాయని తులసిరెడ్డి పేర్కొన్నారు.బకాయిలు పేరుకుపోవడంతో కళాశాల యాజమాన్యాలు సిబ్బందికి జీతాలు చెల్లించలేక, విద్యుత్ బిల్లులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నాయని అన్నారు. విద్యార్థుల నుంచి ఫీజులు చెల్లించాలని ఒత్తిడి వస్తోందని, కొన్నిచోట్ల ఫీజులు చెల్లించకపోతే ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.దీంతో పేద విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లలేక, ఉద్యోగ అవకాశాలను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాల కింద పెండింగ్‌లో ఉన్న రూ.8,500 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని తులసిరెడ్డి కోరారు.

# గండి ఆంజనేయస్వామి సేవలో ఆర్‌కే వ్యాలీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

## -భక్తుల రద్దీలో సేవా కార్యక్రమాలు.. వృద్ధులు, దివ్యాంగులకు అండగా నిలిచిన విద్యార్థులు




వేంపల్లె ఆగస్టు 22 (కదిలించే వార్త): శ్రావణమాసం రెండో శనివారం సందర్భంగా గండి శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆర్‌కే వ్యాలీ ఎన్ఎస్‌-ఎస్ విద్యార్థులు సేవా కార్యక్రమాలతో భక్తులకు అండగా నిలిచారు. ఎన్ఎస్ఎస్ యూనిట్లు 14, 8, 13కు చెందిన విద్యార్థులు, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ జి. తిరుపతిరెడ్డి, ఎన్. సత్యానంద ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో సేవలందించారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూ లైన్లను క్రమబద్ధీకరించడంలో విద్యార్థులు పోలీసు, ఆలయ సిబ్బందికి సహకరించారు. దర్శనానికి వచ్చిన వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన సహాయం అందించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేయడంతో పాటు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలోనూ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం ద్వారా వారిలో సేవా భావంతో పాటు సమాజం పట్ల బాధ్యత పెంపొందుతుందని ఆర్‌కే వ్యాలీ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయ్ ప్రకాష్ అన్నారు. తోటి పౌరుల పట్ల స్నేహభావం, సహకార గుణం, సామాజిక స్ఫూర్తి పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. సేవా కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులను ఆయన అభినందించారు.గండి ఆలయానికి తరలివచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అందించిన సేవలు అభినందనీయమని ఆలయ ఈవో, చైర్మన్ ప్రశంసించారు. విద్యార్థులు భవిష్యత్‌లోనూ సామాజిక సేవా కార్యక్రమాల్లో మరింత చురుగ్గా పాల్గొని సేవా స్ఫూర్తిని చాటాలని ఆకాంక్షించారు.

# శ్రావణమాసం రెండో శనివారం.. భక్తులతో కిటకిటలాడిన వృషభాచలేశ్వర ఆలయం

## - ప్రత్యేక పూల అలంకరణలో శ్రీ స్వామివారు.. భక్తులకు అన్నప్రసాద వితరణ



వేంపల్లె ఆగస్టు 22 (కదిలించే వార్త):

వేంపల్లె పట్టణంలోని పాపాగ్ని నదీతీరాన ఎద్దులకొండపై వెలసిన శ్రీ వృషభాచలేశ్వర స్వామి దేవస్థానంలో శ్రావణమాసం రెండో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ముఖ్య అర్చకులు హరి ప్రవీణ్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూల అలంకరణ చేపట్టారు.శ్రావణమాసం రెండో శనివారం కావడంతో స్వామివారి దర్శనానికి కడప జిల్లాతో పాటు పొరుగు జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తుల రాకతో సందడిగా మారింది.స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తుల కోసం వేంపల్లెకు చెందిన బీజేపీ వాణిజ్య జిల్లా అధ్యక్షుడు దొంతు సుమన్, ఆయన ధర్మపత్ని సూర్యరేఖ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. అన్నప్రసాద వితరణ చేసిన దంపతులను ఆలయ సాంప్రదాయం ప్రకారం దేవస్థానం నిర్వాహకులు సత్కరించారు. స్వామివారి సన్నిధిలో సేవా కార్యక్రమం నిర్వహించడం పట్ల దాతలు సంతోషం వ్యక్తం చేశారు.దేవస్థానంలో ప్రతి శనివారం దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి ఉన్న దాతలు దేవస్థానం కార్యాలయాన్ని సంప్రదించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు.స్వామివారి సన్నిధిలో అన్నప్రసాద వితరణ చేసే దాతలకు వారి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ సంప్రదాయం ప్రకారం సత్కరించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పీవీ రమణ, బీజేపీ నాయకులు సుస్మా, సునీల్‌కుమార్, ప్రసాద్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి కుటుంబ సభ్యులు





పులివెందుల కదిలించే వార్త ఆగస్టు 22

కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని తెదేపా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. శ్రావణమాసంలో ఎంతో పవిత్రమైనటువంటి శనివారం ఉదయం కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామిని తెదేపా శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకుని తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని దేవదేవుని కోరుకున్నానని తెలియజేశారు. అనంతరం శైవ క్షేత్ర మైనటువంటి శ్రీకాళహస్తీశ్వర స్వామి దర్శనంలో భాగంగా ఆలయానికి చేరుకున్నటువంటి రాంగోపాల్ రెడ్డి కుటుంబ సభ్యులకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాంగోపాల్ రెడ్డి కుటుంబ సభ్యులు మరియు ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలందరికీ టీకాలు అందాలి.

## -వ్యాక్సినేషన్ కేంద్రాన్ని తనిఖీ

## - జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ యుగంధర్






లింగాల కదిలించే వార్త ఆగస్టు 22

లింగాల మండల పరిధిలోని పార్నపల్లె గ్రామంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ యుగంధర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం గ్రామ ప్రజలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, పిల్లలకు సకాలంలో తప్పనిసరిగా టీకాలు వేయించాలని సూచించారు. ప్రస్తుత వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.అనంతరం లింగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యతపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా వైద్య సేవలు అందించడంలో వైఎస్సార్ కడప జిల్లా 3వ స్థానంలో నిలవడంపై హర్షం వ్యక్తం చేస్తూ, వైద్య సిబ్బందికి, ఆరోగ్య కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. రాబోయే రోజుల్లో మన జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచేలా అందరూ సమష్టిగా, అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఖాజా మొయినుద్దీన్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్, డాక్టర్ గౌతమి, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, ప్రసాద్,రాజశేఖర్. నరేష్, గంగ శేఖర్, కుసుమ కుమారి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యం

## -టీడీపీ నాయకుడు కానాల మల్లికార్జున రెడ్డి

## -టి. రామాపురంలో ఘనంగా డోర్ టు డోర్ ప్రచారం

బ్రహ్మంగారిమఠం కదిలించే వార్త ఆగస్టు 22

మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు, తెలుగుదేశం పార్టీ బ్రహ్మంగారిమఠం మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి సూచనలతో మండల పరిధిలోని రేకలకుంట పంచాయతీ టి. రామాపురం గ్రామంలో శనివారం డోర్ టు డోర్ (ఇంటింటికీ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు కానాల మల్లికార్జున రెడ్డి నాయకత్వం వహించారు.ఈ సందర్భంగా కానాల మల్లికార్జున రెడ్డి గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండు సంవత్సరాల కాలంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రతి గ్రామానికి అభివృద్ధితో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేలా పారదర్శక పాలన అందిస్తున్నామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చొరవతో టి. రామాపురంలో మోటార్ ప్రారంభం

బ్రహ్మంగారిమఠం కదిలించే వార్త ఆగస్టు 22

నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్న వైఎస్సార్ జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం రేకలకుంట పంచాయతీ పరిధిలోని టి. రామాపురం ఎస్సీ కాలనీ ప్రజల మంచినీటి సమస్యకు పరిష్కారం లభించింది. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రత్యేక చొరవతో కాలనీలో నూతన మంచినీటి మోటార్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఈ మోటార్‌ను కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు కానాల మల్లికార్జునరెడ్డి కొబ్బరికాయ కొట్టి శనివారం ప్రారంభించారు. టి. రామాపురం ఎస్సీ కాలనీవాసులు గడచిన కొన్నేళ్లుగా తాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు కానాల మల్లికార్జునరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డిలు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. కాలనీవాసుల సమస్యపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే, వెంటనే నూతన మంచినీటి మోటార్‌ను మంజూరు చేయించి ఏర్పాటు చేయాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. మోటార్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన కానాల మల్లికార్జునరెడ్డి, మండల అభివృద్ధి అధికారి (MDO) రామచంద్రారెడ్డిలకు కాలనీ ప్రజలు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా సత్కరించి తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీలోని ఇతర మౌలిక వసతుల సమస్యలను ప్రజలు కానాల మల్లికార్జునరెడ్డి దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌తో చర్చించి దశలవారీగా అన్ని సమస్యలనూ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ హరికృష్ణ, ఏఓ నరసయ్య,



ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి శ్రీనువాసరెడ్డి, టీడీపీ నాయకులు గుజ్జు రామాంజనేయులు, పెరుగు నాగేంద్ర, పుటాల శివాయాదవ్, నాగిపోగు రాధాకృష్ణ, బాబు, శౌరిలతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

# షావుకారు జానకికి ఘన నివాళి అర్పించిన రాయలసీమ రంగస్థలి చైర్మన్

తిరుపతి రూరల్ కదిలించే వార్త 22 ఆగస్టు

తిరుపతిలోతెలుగు సినీ రంగంలోని ప్రముఖ నటి, రంగస్థలి కళాకారిణి షావుకారు జానకి మరణం పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ తిరుపతిలోని ఘంటసాల విగ్రహం వద్ద ఆమె చిత్రపటానికి రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. సంస్థ చైర్మన్ గుండాల గోపీనాథ్ నేతృత్వంలో కళాకారులు పుష్పాంజలి ఘటించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా రంగస్థలి కార్యదర్శి కె.ఎన్. రాజా, సభ్యులు టీచర్ తిరుమలయ్య మాట్లాడుతూ, షావుకారు జానకి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో వందలాది చిత్రాల్లో నటించి తన సహజ నటనతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారని అన్నారు. "షావుకారు" చిత్రంతో విశేష గుర్తింపు పొందిన ఆమె, ఏడు దశాబ్దాలకు పైగా సినీ, రంగస్థల రంగాలకు చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆమె నటన నేటి తరానికి ఆదర్శమని, భారతీయ సినీ చరిత్రలో ఆమె పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని కొనియాడారు. కళా రంగానికి ఆమె చేసిన సేవలను గుర్తిస్తూ భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రధానం చేసిందని గుర్తు చేశారు.. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్, కార్యదర్శి కె.ఎన్. రాజా, సభ్యులు తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, కొట్టే సుబ్రహ్మణ్యం, టీచర్ తిరుమలయ్య, పోలే జనార్ధన్, చిత్రపు హనుమంతరావు, సురేష్, పొన్నాల జేజిరెడ్డి తదితరులు పాల్గొని షావుకారు జానకికి ఘన నివాళులు అర్పించారు.



# దివ్యాంగులకు నిత్యవసరాల వితరణ.

## -- వైయస్సార్సీపి నేత కడియాల లక్ష్మీనారాయణ

పులివెందుల కదిలించే వార్త ఆగస్టు 22

అవయవాలు లేని వ్యక్తులకు ఆత్మస్థైర్యం ఎక్కువగా ఉంటుందని, అంగవైకల్యంతో కూడా తమ దైనందిన కార్యక్రమాలు నిర్వహించుకుంటూ వివిధ వృత్తులలో రాణిస్తూ, జనజీవన స్రవంతిలో కలిసిపోయి, సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా, అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టించే విభిన్న ప్రతిభావంతులుగా భావితరాలకు స్ఫూర్తి ప్రదాతలుగా మారుతున్నారని, కడియాల కుటుంబసభ్యులు ఎల్లప్పుడూ సేవకు కట్టుబడి ఉంటారని, మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను ఎన్నడూ మరువరాదని, తనతండ్రి కడియాల దూలం సుబ్బరాయుడు తమకు చిన్నతనం నుండి పదిమందికి సాయం చేసే గుణం, సేవాతత్పరత నేర్పారని, ఆయన చూపిన బాటలో పయనిస్తూ, ప్రతి ఏడాది ఆయన స్మారకార్థం అనాథలు, దివ్యాంగులు తదితర వర్గాలకు చేయూతనశీదించడం కడియాల కుటుంబీకులకు ఆనవాయితీనని పట్టణ వైఎస్ఆర్సిపి నాయకులు కడియాల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.లి స్వర్గీయ కడియాల దూలం సుబ్బరాయుడు 9వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో గల వికలాంగుల కమ్యూనిటీ భవనంలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ వ్యాపారవేత్త, పట్టణ వైఎస్ఆర్సిపి నాయకులు కడియాల లక్ష్మీనారాయణ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళి అర్పించారు. అనంతరం ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈసందర్భంగా 30 మంది దివ్యాంగుల కుటుంబాలకు కడియాల బ్రదర్స్ నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. తదనంతరం దివ్యాంగులు, కడియాల యువసేన సభ్యులు లక్ష్మీనారాయణను దుశ్శాలువాతో



ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్రఅధ్యక్షులు డా. ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, కార్యదర్శి సునీల్, కడియాల కుటుంబసభ్యులు లక్ష్మీనారాయణ, జనార్దన్, వరుణ్, టైలరింగ్ ట్రైనింగ్ టీచర్ మల్లీశ్వరి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఖాదర్ బాషా, కడియాల యూత్ అసోసియేషన్ సభ్యులు పాలగిరి ప్రదీప్, దేవా, నాగేంద్ర, బాబ్జి, గౌస్, దివ్యాంగుల కుట్టు శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాన కార్యక్రమానికి వస్తువుల వితరణ

పులివెందుల కదిలించే వార్త ఆగస్టు 22

పులివెందులలోని కోతి సమాధి వద్ద నిర్వహించు అన్నదాన కార్యక్రమానికి పులివెందుల మాజీ కౌన్సిలర్ కోడి రమణ వస్తువులను వితరణగా అందించారు. ఈ సందర్భంగా కోడి రమణ మాట్లాడుతూ పులివెందుల ప్రాంతంలో ప్రాముఖ్యత కలిగిన కోతి సమాధి అభయాంజనేయ స్వామి ఆలయం నందు శ్రావణ శనివారాన్ని పురస్కరించుకొని 29 8 2026 తేదీన నిర్వహించు అన్నదాన కార్యక్రమాలకి తమ వంతు సహాయ సహకారాలు అందించడం ఆనందాన్నిస్తోందని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ శుభకరమైన శ్రావణమాసంలో నిర్వహించు పూజాఫలాలకు మరియు అన్నదాన కార్యక్రమాలకు విశేష ప్రతిఫలాలు సంక్రమిస్తాయని కావున రానున్న శనివారం నిర్వహించు అన్నదాన కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు.



# 'బాబాసాహెబ్ పంచశీల ద్వారా అంబేద్కరిజం పునరుజ్జీవనం' సెమినార్‌ను విజయవంతం చేయాలి

## -మాల్కోవా కడప జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మర్రిపాటి నాగరాజు ఆది అనిల్ కుమార్ పిలుపునిచ్చారు.

కడప, ఆగస్టు 22: కదిలించే వార్త

విజయవాడలో అక్టోబర్ 10న నిర్వహించనున్న 'బాబాసాహెబ్ పంచశీల ద్వారా అంబేద్కరిజం పునరుజ్జీవనం' సెమినార్‌ను విజయవంతం చేయాలని మాల్గోవా కడప జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మర్రిపాటి నాగరాజు, ఆది అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం కడపలో సెమినార్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించిన వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అంబేద్కర్ సిద్ధాంతాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. అంబేద్కర్ ఆశయాల సాధనలో భాగంగా పంచశీల, అంబేద్కర్ సూత్రాలపై చర్చించడం ఈ సెమినార్ ప్రధాన ఉద్దేశమన్నారు. ఓటు విలువను ప్రతి ఒక్కరూ గుర్తించాలని, డబ్బుకు ఓటును అమ్ముకోకుండా మంచి సమాజ నిర్మాణం కోసం పనిచేసే అభ్యర్థులకు ఓటు వేయాలని సూచించారు. జిల్లాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి సెమినార్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శంకరయ్య, రమేష్‌కుమార్, ఈరగయ్య, రాజేష్, సుబ్బరాయుడు, లెనిన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయండి

## -- ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొండంనాటి ప్రశాంత్

కడప/రాజమండ్రి ఆగస్టు. 22 కదిలించే వార్త

రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ ఎస్ యు) ఆధ్వర్యంలో ఈ నెల 24, 25, 26 తేదీలలో రాజమండ్రి వేదికగా నిర్వహించనున్న రాష్ట్ర ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతూ నేడు రాజమండ్రి నన్నయ విశ్వవిద్యాలయంలో గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొండంనాటి ప్రశాంత్ మాట్లాడుతూ, విద్యా రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ విద్య పరిరక్షణ, విద్యార్థుల హక్కులు, సంక్షేమ వసతి గృహాల పరిస్థితి, నిరుద్యోగం వంటి కీలక అంశాలపై రాష్ట్ర ప్లీనరీలో విస్తృతంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి విద్యార్థి నాయకులు, ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరుకానున్న ఈ ప్లీనరీ సమావేశాలు విద్యార్థి ఉద్యమాలకు కొత్త దిశను నిర్దేశిస్తాయని అన్నారు. విద్యార్థులు, యువత, ప్రజాస్వామ్యవాదులు ప్లీనరీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు నూకరాజు, స్థానిక నాయకులు చంద్రప్ప, శంకర్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



# అద్దె ప్రాతిపదికన షాపింగ్ కాంప్లెక్స్ నిర్వహణకు బహిరంగ వేలం

## -పులివెందుల మున్సిపల్ కమిషనర్ తనూజ

పులివెందుల కదిలించే వార్త ఆగస్టు 22

పులివెందుల పురపాలక సంఘమునకు చెందిన వివిధ షాపింగ్ కాంప్లెక్స్ లను అద్దె ప్రాతిపదికన కేటాయించుటకు వేలంపాట నిర్వహించబడునని పులివెందుల మున్సిపల్ కమిషనర్ తనూజ పేర్కొన్నారు. శనివారం పత్రికలకు అందించినటువంటి సమాచారం మేరకు పురపాలక సంఘమునకు చెందినటువంటి షాపింగ్ కాంప్లెక్స్ లను మూడు సంవత్సరముల కాలమునకు అద్దెకిచ్చుటకు 27.8. 2026 గురువారం బహిరంగ వేలం నిర్వహించబడునని ఆసక్తి గలవారు గురువారం ఉదయం లోపల వంద రూపాయలు చెల్లించి దరఖాస్తు చేసుకుని నియమ నిబంధనలు మరియు ఖాళీగా ఉన్న రూమ్ వివరాలను తెలుసుకొని సంబంధిత వార్డు సచివాలయాల యందు అడ్మిన్ సెక్రటరీలను సంప్రదించగలరని మరియు అదే విధంగా పని వేళల యందు మున్సిపల్ కార్యాలయంలోని నోటీసు బోర్డులో గల వివరాలను పరిశీలించవలసినదిగా విజ్ఞప్తి చేశారు.

# డ్రోన్ నిఘాతో గాండీలో అసాంఘిక కార్యకలాపాలకు చెక్!

## - శ్రావణమాసం రెండో శనివారం బందోబస్తులో భాగంగా విస్తృత డ్రోన్ బీట్





వేంపల్లె ఆగస్టు 22 (కదిలించే వార్త): గాండీ క్షేత్రంలో శ్రావణమాసం రెండో శనివారం భక్తుల రద్దీ దృష్ట్యా పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. బందోబస్తు విధుల్లో భాగంగా జూదం, బహిరంగ మద్యపానం, ఇతర అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు డ్రోన్ బీట్ నిర్వహించినట్లు వేంపల్లి సీఐ టీ. నరసింహులు తెలిపారు. రవి రెడ్డి పెట్రోల్ బంక్ నుంచి పాలిటెక్నిక్ కళాశాల, గవిమల్లేశ్వరస్వామి ఆలయ రోడ్డు, గాండీ రోడ్డు మీదుగా కుమ్మరంపల్లి గ్రామం వరకు డ్రోన్‌తో పోలీసులు నిఘా చేపట్టారు. జనసంచారం తక్కువగా ఉండే ప్రాంతాలు, తోటలు, ఖాళీ ప్రదేశాలపై ప్రత్యేకంగా పర్యవేక్షణ కొనసాగించారు. శ్రావణమాసం సందర్భంగా గాండీ క్షేత్రానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. భక్తులకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరించినా, జూదం, బహిరంగ మద్యపానం లేదా ఇతర చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని సీఐ టీ. నరసింహులు హెచ్చరించారు. భక్తుల భద్రతే లక్ష్యంగా గాండీ క్షేత్రం పరిసరాల్లో పోలీసుల నిఘా, బందోబస్తు నిరంతరం కొనసాగుతుందని సీఐ స్పష్టం చేశారు.

# ఘనంగా మెగాస్టార్ చిరంజీవి 71వ జన్మదిన వేడుకలు

## -సినిమా రంగంలోనే కాదు.. సేవా కార్యక్రమాల్లోనూ చిరంజీవి స్ఫూర్తిదాయకుడు

## -జనసేన సీనియర్ నేత దాసరి రవిశంకర్



వేంపల్లె ఆగస్టు 22 (కదిలించే వార్త):


పద్మవిభూషణ్ మెగాస్టార్ డాక్టర్ చిరంజీవి 71వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పులివెందుల నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నేత దాసరి రవిశంకర్ ఆధ్వర్యంలో శనివారం వేంపల్లె పట్టణంలో ఘనంగా నిర్వహించారు. దాసరి రవిశంకర్ కార్యాలయంలో చిరంజీవి జన్మదిన కేక్‌ను కట్ చేసి అభిమానులు, నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దాసరి రవిశంకర్ మాట్లాడుతూ.. తెలుగు సినీ రంగంలో అగ్ర కథానాయకుడిగా కోట్లాది మంది అభిమానుల మనసుల్లో స్థానం సంపాదించుకున్న చిరంజీవి, సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల గుండెల్లో మరింత ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు. సినిమా రంగంతో పాటు సేవా, రాజకీయ రంగాల్లో తనదైన ముద్ర వేసుకున్నారని అన్నారు. రక్తదానం, నేత్రదానం వంటి సేవా కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ ఎంతోమందికి ప్రాణదాతగా నిలిచారని పేర్కొన్నారు. కరోనా మహమ్మారి సమయంలో ఆక్సిజన్ సిలిండర్లు, ఇతర సహాయాన్ని అందించి ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచిన చిరంజీవి సేవా స్ఫూర్తి అభినందనీయమన్నారు. అభిమానాన్ని కేవలం వేడుకలకే పరిమితం చేయకుండా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా చిరంజీవి జన్మదిన వేడుకలకు సార్థకత చేకూర్చాలని దాసరి రవిశంకర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నందిపల్లి మాజీ సర్పంచ్ వీరలింగేశ్వర రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, గంగులయ్య, రామచంద్ర, నారాయణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కడప కార్పొరేషన్ ఎన్నికలను అధిష్టానం ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి

## -టిడిపి నగర ఉపాధ్యక్షులు కొండ సుబ్బయ్య

కడప ఆగస్టు 22 కదిలించే వార్త

కడప నగరంలో జరగబోయే కార్పొరేషన్ ఎన్నికలను తెలుగుదేశం పార్టీ అధిష్టానం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కడప నగర టీడీపీ ఉపాధ్యక్షుడు కొండా సుబ్బయ్య కోరారు. ప్రజల్లో మంచి గుర్తింపు, పార్టీ కోసం పనిచేసే సామర్థ్యం ఉన్న నాయ కులు, కార్యకర్తలను ప్రత్యేక కమిటీ ద్వారా గుర్తించి ఎన్నికల బాధ్యతలు అప్పగించాలని సూచించారు. నగరాన్ని ఐదు లేదా ఆరు ప్రాంతాలుగా విభజించి, ప్రతి ప్రాంతానికి సమర్థులైన నాయకులను నియమించి జయా పజ యాల బాధ్యతను వారికి అప్పగించాలని అన్నారు .ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజ ల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలకు అండగా నిలవాలని కోరారు. ఇప్పటి నుంచే నాయకులు, కార్యకర్తలను బలోపేతం చేస్తే 2029 ఎన్నికల నాటికి కడప నగరంలో టీడీపీకి పటిష్టమైన క్యాడర్‌ను తయారు చేయవచ్చని కొండా సుబ్బయ్య పేర్కొన్నారు.



# 2029 నాటికి ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం ఇవ్వకపోతే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సమాధులు కడతాం....

## - ప్లీనరీ సమావేశం లో అసంఖ్యాక జనవాహిని వేల మందితో భారీగా విజయవంతం....



కడప/అనంతపురం, ఆగస్టు 22: కదిలించే వార్త

2029 నాటికి ప్రత్యేక రాయలసీమ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమాధులు కడతాం, ఉద్యమం మరింత ఉధ్రుతం చేపడతామని రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకటసుబ్బారెడ్డి హెచ్చరించారు.అనంతపురంలోని ఎన్జీవో హోంలో శనివారం నిర్వహించిన రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ ప్లీనరీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లీనరీ సమావేశంలో అసంఖ్యాక జనవాహిని వేల మందితో భారీగా సభ విజయవంతమైందని, రాయలసీమ ప్రాంతం ఎన్నో ఏళ్లుగా వెనుకబాటుతనం, కరువు, నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు వంటి సమస్యలను ఎదుర్కొంటోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మారుతున్నా రాయలసీమ పరిస్థితుల్లో మాత్రం ఆశించిన మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.శ్రీబాగ్ ఒప్పందం అమలు, మిగులు జలాల్లో హక్కు, ఉద్యోగాలు, పరిశ్రమలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, నిధుల్లో రాయలసీమకు న్యాయమైన వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక ప్యాకేజీల పేరుతో రాయలసీమ ప్రజలను మభ్యపెట్టడం సరికాదన్నారు.రాయలసీమకు జరుగుతున్న అన్యాయాలను ప్రతి గ్రామానికి, ప్రతి గడపకు తీసుకెళ్లి ప్రజల్లో చైతన్యం కల్పిస్తామని తెలిపారు. ప్లీనరీలో ఆమోదించిన తీర్మానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపనున్నట్లు పేర్కొన్నారు. 2029 నాటికి ప్రత్యేక రాయలసీమ రాష్ట్రాన్ని సాధించే దిశగా ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని డాక్టర్ కుంచం వెంకటసుబ్బారెడ్డి స్పష్టం చేశారు.

# సిఎస్ ఐ బిషప్ ఐజాక్ వరప్రసాద్ ను తొలగించాలి:

## -సినాడ్ కు పాస్టర్ల ఫిర్యాదు



సిపిఐ నగర కార్యదర్శి యన్ వెంకట శివ, కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, సిఎస్ఐ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కడప ఆగస్టు 22: కదిలించే వార్త

రాయలసీమ డయాసిస్, సిఎస్ ఐ బిషప్ పెయ్యల ఐజాక్ వరప్రసాద్ వ్యవహార శైలిపై పలు తీవ్ర ఆరోపణలు చేస్తూ, ఆయనను బాధ్యతల నుంచి తొలగించి సమగ్ర విచారణ జరపాలని కోరుతూ సీఎస్ ఐ సీనాడ్ కు ఫిర్యాదు చేసినట్లు సీనియర్ పాస్టర్ రెవరెండ్ ఐక్యత రావు తెలిపారు.ఈ నెల 19వ తేదీన చెన్నైలో సీనాడ్ మోడరేటర్ కు సమర్పించిన అప్పీల్‌లో తమ సస్పెన్షన్, మంత్రిత్వ బాధ్యతల నుంచి తొలగింపు, జీతాల నిలిపివేతతో పాటు సీఎస్ఐ హైస్కూల్ స్థలాలకు సంబంధిం చిన లీజులు, భూ వ్యవహారాలు, కోర్టు ఆదేశాలు తదితర అంశాల ను ప్రస్తావించినట్లు తెలిపారు. తమపై తీసుకున్న చర్యల్లో సరైన విధివిధానాలు పాటించలేదని పేర్కొంటూ వినతిపత్రం సమ ర్పించినట్లు వెల్లడించారు.తమ ఫిర్యాదుపై సీనాడ్ నుంచి సానుకూల స్పందన లభించిం దని, ఆరోపణలపై త్వరలో విచారణ జరిపి బిషప్ పై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పాస్టర్లు తెలిపారు. పాస్టర్ల ఆందోళన కు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్ పీ ఐ అథవాలే) సంపూర్ణ మద్దతు ప్రకటించింది.ఈ కార్యక్రమంలో పాస్టర్లు దేవ సహా యం, మనోరంజన్, మో జస్, వి.ప్రభాకర్, షుబుద్దిన్, ప్రేమ సాగర్, యన్. ప్రభాకర్,

# ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలను అరికట్టాలి

## -సీపీఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్



బ్రహ్మంగారిమఠం కదిలించే వార్త ఆగస్టు 22

మండలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్ కేబుళ్ల దొంగతనాలు వరుసగా జరుగుతున్నప్పటికీ వాటిని అరికట్టడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ ఆరోపించారు. శనివారం నర్సిరెడ్డిపల్లెలో ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనం జరిగిన ప్రాంతాన్ని సీపీఎం నాయకులు పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లింగాలదిన్నెపల్లికి చెందిన కౌలు రైతు చీమల రామిరెడ్డి (62) నర్సిరెడ్డిపల్లెలో గాలి కరుణాకర్ రెడ్డికి చెందిన పొలాన్ని సాగు చేసుకుంటున్నారని తెలిపారు. గత రాత్రి గుర్తుతెలియని దుండగులు పొలంలో ఉన్న 16 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, అందులోని విలువైన కాపర్‌ను అపహరించుకెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు.మండలంలో గత కొంతకాలంగా వరుస చోరీలు జరుగుతుండటంతో రైతులు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, పంటలకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదులు చేసినా నిందితులను పట్టుకోవడంలో అలసత్వం వహిస్తున్నారని, దీనివల్ల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారని అన్నారు.వెంటనే పోలీస్ శాఖ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దొంగలను అరెస్టు చేయాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో రాత్రివేళ గస్తీ పెంచి రైతులకు భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు గోవింద్, బాధితుడైన రైతు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భక్తజన సందోహంతో కిక్కిరిసిన గండి క్షేత్రం

## -రెండో శ్రావణ శనివారం అంజన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు.. సర్వదర్శనం క్యూ లైన్‌లో భారీ రద్దీ



గండి ఆగస్టు 22 (కదిలించే వార్త):

రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానం రెండో శ్రావణ శనివారం భక్తజన సందోహంతో కిక్కిరిసిపోయింది. శ్రావణమాసం తొలి శనివారంలాగే రెండో శనివారం కూడా అంజన్న దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఎర్రగుంట్ల, కమలాపురం, వీరపనాయునిపల్లె, వేంపల్లె, వేముల తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరాగా, పలువురు భక్తులు కాలినడకన గండి చేరుకోవడం విశేషం.గండి అంజన్న దర్శనానికి వచ్చిన భక్తులు పాపాఘ్ని నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి దర్శనం కోసం క్యూ లైన్లలో బారులు తీరారు. ముఖ్యంగా సర్వదర్శనం క్యూ లైన్ భక్తులతో కిక్కిరిసిపోయింది. అయితే వీఐపీ, రూ.50 దర్శన మార్గాల్లో పెద్దగా రద్దీ కనిపించలేదు.భక్తుల రద్దీ భారీగా ఉన్నప్పటికీ ఆర్‌కే వ్యాలీ సీఐ శంకర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీప్రియ ప్రత్యేక శ్రద్ధతో విధులు నిర్వహిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. క్యూ లైన్లను క్రమబద్ధీకరించడంతో పాటు భక్తుల రాకపోకలను పర్యవేక్షించారు.ఈసారి భక్తులకు స్వామివారి మూలవిరాట్ స్పష్టంగా దర్శనమయ్యేలా ఏర్పాట్లు చేయడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. గతంతో పోలిస్తే దర్శన ప్రక్రియ మరింత క్రమబద్ధంగా సాగడంతో భక్తులు ప్రశాంతంగా అంజన్నను దర్శించుకుని తిరిగి వెళ్లారు.గండికి తరలివచ్చిన భక్తుల కోసం ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు, లడ్డూ ప్రసాదాలను అందుబాటులో ఉంచారు. సుమారు 25 వేల లడ్డూ ప్రసాదాలు పూర్తిగా అయిపోయాయి. పులిహోర ప్యాకెట్లు కూడా పూర్తిగా అయిపోయాయి. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉచిత ప్రసాదాల పంపిణీ చేపట్టారు.భక్తుల కోసం క్యూలైన్లలో తాగునీటి ఏర్పాట్లు చేసి సేవకుల ద్వారా నీటిని



అందించారు.దర్శనానికి వచ్చిన భక్తులను ఆకట్టుకునేలా శ్రీ వీరాంజనేయస్వామివారిని ప్రత్యేక తోమాల సేవతో అలంకరించారు. ప్రధాన అర్చకులు కేసరి నక్షకులు రాజా రమేష్ ఆధ్వర్యంలో మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అలంకరణ నిర్వహించారు.భక్తుల ఆధ్యాత్మిక కాలక్షేపం కోసం కోలాటం, చెక్కభజనలు, తాళాల భజనలు, హరికథ తదితర కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చక్రాయపేట వైద్యాధికారి డాక్టర్ ఊర్మిళ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో సుమారు 2 వేల మందికి వైద్య సేవలు అందించారు. అత్యవసర పరిస్థితుల కోసం 108 వాహనాలను అందుబాటులో ఉంచడంతో పాటు రక్తదాన శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు.ఆలయ సహాయ కమిషనర్ సి. విశ్వనాథం, చైర్మన్ వెంకటస్వామి ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. పోలీసు, ఆలయ అధికారులు, వైద్య సిబ్బంది, సేవకుల సమన్వయంతో రెండో శ్రావణ శనివారం గండి క్షేత్రంలో భక్తులకు ప్రశాంతమైన దర్శనం లభించింది.



# గండి క్షేత్రంలో అన్నదానానికి పోటెత్తిన దాతలు


## - రెండో శ్రావణ శనివారం భక్తులకు భారీగా అన్నప్రసాద వితరణ.. వేలాది మందికి భోజన సదుపాయం



గండి, ఆగస్టు 22 (కదిలించే వార్త):

శ్రావణమాసం రెండో శనివారం గండి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానానికి భారీగా తరలివచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం లోటు లేకుండా ఆలయ అధికారులు, వివిధ ప్రాంతాలకు చెందిన దాతలు, భక్తులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఆలయ ఈవో సి. విశ్వనాథం తెలిపిన వివరాల మేరకు దేవస్థానం ఆధ్వర్యంలో సుమారు 10 వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్నప్రసాద వితరణను క్రమబద్ధంగా చేపట్టారు.కడప సప్తగిరి గోవిందమాల కమిటీ అధ్యక్షుడు మల్లెల రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి చంద్రగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 10 వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. భక్తులకు భోజనం, తాగునీరు అందిస్తూ సేవా కార్యక్రమాన్ని కొనసాగించారు.అదేవిధంగా కాశిరెడ్డి నాయన ఓబయ్య, ఎంపీ కుంట మండలానికి చెందిన ఓబులేసు రామచంద్ర ఆధ్వర్యంలో సుమారు 4 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు.గండి శ్రీకృష్ణ దేవాలయం వద్ద ట్రాన్స్‌కో విద్యుత్ అధికారులు, సిబ్బంది కూడా భారీగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేంపల్లె సమీపానికి చెందిన ఓ భక్తుడు సైతం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టి గండికి వచ్చిన భక్తులకు భోజన సదుపాయం కల్పించారు.రెండో శ్రావణ శనివారం భక్తుల సంఖ్య భారీగా ఉన్నప్పటికీ వివిధ ప్రాంతాల నుంచి దాతలు ముందుకొచ్చి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడంతో భక్తులకు అన్నప్రసాదం కొరత లేకుండా ఏర్పాట్లు జరిగాయి. భక్తులకు సేవ చేయాలనే సంకల్పంతో దాతలు పెద్ద సంఖ్యలో ముందుకు రావడం పట్ల ఆలయ అధికారులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. "అన్నదానం మహాదానం" అనే స్ఫూర్తితో గండి క్షేత్రంలో దాతలు చేపట్టిన సేవా కార్యక్రమాలు భక్తులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచాయి.

# వకుళమాత అమ్మవారికి సారే సమర్పణ పూజ శ్రీ ప్రతాప స్వామిజి



తిరుపతి రూరల్ కదిలించే వార్త 22 ఆగస్టు

తిరుపతి రూరల్ లోశ్రావణ మాసం మొదటి శనివారం పర్వదినము సందర్భంగా వకుళమాత అమ్మవారికి తిరుపతి నగర సంకీర్తన మండలి సభ్యులు రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి, ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు పూజ్యశ్రీ ప్రతాప్ స్వామీజీ ఆధ్వర్యంలో పసుపు, కుంకుమ, చీర,పళ్ళు తో అమ్మవారికి సారే సమర్పించరు. ప్రతి ఏడాది శ్రావణమాసంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సారె సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా నగర సంకీర్తన మండల సభ్యులు గుండాల గోపీనాథ్ రెడ్డి, ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ లు మాట్లాడుతూ సాక్షాత్తు కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి తల్లి గారైన వకుళ మాతకు ప్రతి ఏడాది లాగా ఈ ఏడాది కూడా శ్రావణమాసం చివరి శనివారం సారె ను సమర్పించడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. అమ్మవారి దీవెనలు తో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు ఈ ఆనవాయితీని మునుముందు కూడా కొనసాగిస్తామన్నారు. వెంకటేశ్వర స్వామి వేషధారణగా మిట్టపల్లి బ్రహ్మానందరెడ్డి, శ్రీదేవి భూదేవి వేషధారణలుగా బుజ్జమ్మ,, గీతలు వేషధారణతో వేసి అమ్మవారిని మొక్కుకున్నారు దర్శనం అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలం చైర్మన్ గుండాల గోపీనాథ్ రెడ్డి చిగోరా ఆధ్యాత్మిక కేంద్రం వ్యవస్థాపకులు చిత్రపు హనుమంతరావు నగర సంకీర్తన మండలి సభ్యులు మేడసాని మోహన్ నాయుడు, నరేష్ చౌదరి, లోక ప్రభాకర్ రాయుడు,, పైన ఆచారి అరుణమ్మ, పావని, చంద్రా, నాగార్జున రెడ్డి, రామ్ కుమార్, విగ్రహాల కళ్యాణి పద్మావతి భాగవతుల జయలక్ష్మి లక్ష్మీరంగనాథన్ లీలావతి కొండే చెంగారెడ్డి తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి మునినాధ రెడ్డి మల్లారపు వాసు దంపతులు నరేష్ నాయుడు మునేంద్ర రెడ్డి బాబు దంపతులు

# పరిశుభ్రత అందరి బాధ్యత: ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి కార్పొరేషన్ కదిలించే వార్త 22 ఆగస్టు

తిరుపతి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్చాంధ్ర లో భాగంగా రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్పోరేషన్ అధికారులు శుభ్రపరిచారు. స్వచ్చాంధ్రకు కట్టుబడి పరిశుభ్రతలో భాగస్వాములవుతామని ప్రమాణం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు స్వర్ణాంధ్ర - స్వచ్చాంధ్ర సాధనే లక్ష్యంగా పని చేస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఇంటిని ఎలా పరిశుభ్రంగా ఉంచుకుంటామో అలాగే నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ప్రభుత్వం ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర - స్వచ్చాంధ్రలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కార్పోరేషన్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రాష్ట్ర గ్రీన్, బ్యూటిఫికేషన్ ఛైర్ పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పోరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, మాజీ డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మాజీ కార్పొరేటర్ ఎస్కే బాబు, హెల్త్ ఆఫీషర్ డాక్టర్ యువ అన్వేష్, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్ , ఆర్ ఓ లు సేతు మాధవ్, రవి, డిఈలు పాల్గొన్నారు.



# కమల్ అమృత్ వాణి-235



దయయా పూరితం చిత్తం దుఃఖితానాం హితప్రదమ్ ।
పరపీడావిహీనస్య జీవనం సార్థకం భవేత్ ॥తాత్పర్యం.


దయతో నిండిన హృదయం నిజమైన మానవత్వానికి ప్రతీక.

బాధలో ఉన్నవారిని ఓదార్చడం గొప్ప సేవ.ఇతరుల కష్టాన్ని అర్థం చేసుకోవడం మనసును విశాలం చేస్తుంది.మన వల్ల ఎవరికీ అనవసరమైన బాధ కలగకుండా జీవించాలి.చిన్న సహాయం కూడా బాధలో ఉన్నవారికి గొప్ప ఆశగా మారుతుంది.దయ ఉన్న చోట ద్వేషానికి, క్రూరత్వానికి స్థానం ఉండదు. ఇతరుల కన్నీటిని తుడిచే చేతులే నిజమైన పవిత్రమైన చేతులు. దయతో గడిపిన జీవితం మాత్రమే మానవ జీవితానికి సార్థకతను ఇస్తుంది.

-- కమలేకర్ నాగేశ్వర్ రావు 'కమల్'

# 'నేనెవరినీ మోసం చేయలేదు'

### -'పెళ్లి పేరుతో ప్రసాద్‌రెడ్డి నన్ను మానసికంగా వేధించాడు'
### -ఎస్తేరు రాణి సంచలన ఆరోపణలు




వేంపల్లె ఆగస్టు 22 (కదిలించే వార్త):

తాను డబ్బులు తీసుకుని పెళ్లి చేసుకోకుండా మోసం చేశానంటూ తనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని కడప రవీంద్రనగర్‌కు చెందిన ఎస్తేరు రాణి తెలిపారు. పెళ్లి చేసుకోవాలంటూ వేంపల్లి మండలం కత్తులూరు గ్రామానికి చెందిన వెంకట ప్రసాద్‌రెడ్డి తనను చాలాకాలంగా మానసికంగా వేధించేవాడని ఆమె ఆరోపించారు.వెంకట ప్రసాద్‌రెడ్డి తనపై చీటింగ్ కేసు పెట్టిన నేపథ్యంలో శనివారం ఎస్తేరు రాణి విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం డిప్యూటేషన్‌పై పులివెందులలోని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్నట్లు తెలిపారు. విధుల్లో భాగంగా కడప నుంచి పులివెందులకు బస్సులో వచ్చి వెళ్లే క్రమంలో ప్రసాద్‌రెడ్డి పరిచయమయ్యాడని చెప్పారు. తమకు ఏడాది కాలంగా పరిచయం ఉందని, అప్పుడప్పుడు ప్రసాద్‌రెడ్డి తనకు డబ్బులు ఇచ్చేవాడని, ఇద్దరం కలిసి షాపింగ్‌కు వెళ్లేవారమని ఆమె తెలిపారు. అయితే తాను పెళ్లికి సిద్ధంగా లేనని పలుమార్లు స్పష్టం చేసినప్పటికీ, డబ్బులు ఆశ చూపుతూ తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేసేవాడని ఆరోపించారు.తాను వేరొకరిని పెళ్లి చేసుకుంటే చంపేస్తానంటూ ప్రసాద్‌రెడ్డి బెదిరించేవాడని ఎస్తేరు రాణి ఆరోపించారు. "నన్నే పెళ్లి చేసుకోవాలి.. లేదంటే మరొకరిని పెళ్లి చేసుకోకూడదు" అంటూ తనను వేధించేవాడని పేర్కొన్నారు.ఈ నెల 18వ తేదీ రాత్రి పెళ్లి చేసుకోవాలని ప్రసాద్‌రెడ్డి ఫోన్ చేయగా తాను నిరాకరించానని, దీంతో తనపై అసత్య ఆరోపణలు చేస్తూ వేంపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఆమె తెలిపారు. ఈ వ్యవహారంపై వేంపల్లి సీఐ నరసింహులు విచారించగా తనకు తెలిసిన పూర్తి వివరాలను వెల్లడించినట్లు చెప్పారు.ప్రసాద్‌రెడ్డి ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నానని చెప్పడంతో తాను వద్దన్నప్పటికీ అప్పుడప్పుడు డబ్బులు ఇచ్చేవాడని తెలిపారు. తాను మోసం చేయాలనుకున్న వ్యక్తినైతే సీఐ నరసింహులు సమక్షంలో ప్రసాద్‌రెడ్డికి రూ.5.60 లక్షల చెక్కును ఎందుకు అందజేస్తానని ప్రశ్నించారు. తిరిగి డబ్బులు చెల్లించానని, అయినప్పటికీ తనపై అసత్య ఆరోపణలు చేయడం బాధాకరమని అన్నారు.ఒక మహిళననే కనికరం లేకుండా తనపై తప్పుడు ఆరోపణలు చేయడం దుర్మార్గమని ఎస్తేరు రాణి ఆవేదన వ్యక్తం చేశారు. తనపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు.

# త్వరలో సబ్ రిజిస్టర్ కార్యాలయం ముందు ధర్నా

### అవినీతి తిమింగలం సబ్ రిజిస్టర్ అమిలినేని రామ్మోహన్ ను వెనకేసుకొస్తున్న అధికార పార్టీ నాయకులు

### ధనుంజయ నాయక్ GVSS జిల్లా అధ్యక్షులు హెచ్చరిక




అనంతపురం, కదిలించే వార్త, ఆగస్టు 22 :

ఎక్కడో మారుమూల ప్రాంతమైన కళ్యాణదుర్గం లో రోజు రోజుకు పుట్ట గొడుగు ల పుట్టుకొస్తున్న కళ్యాణదుర్గం సబ్ రిజిస్టర్ అవినీతి అధికార దాహంతో విచ్చలవిడిగా అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తూ పెద్ద ఎత్తున అవినీతి పాల్పడుతున్నటు వంటి అవినీతి తిమింగలం కళ్యాణదుర్గం సబ్ రిజిస్టర్ అమిలినేని రామ్మోహన్ పై మరో వారం రోజుల్లో చర్యలు తీసుకొని పక్షంలో కళ్యాణదుర్గం లోని రిజిస్టర్ కార్యాలయం ఎదుట రాజకీయ పార్టీలు మరియు అన్ని కుల సంఘాలతో చర్చించి పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

### రిజిస్టర్ డాక్టర్ రమేష్ బాబు ను సన్మానిస్తున్నటైం స్కేల్ ఉద్యోగులు

అనంతపురం, ఎస్కేయూ, కదిలించే వార్త, ఆగస్టు 22 :

ఎస్కేయూ టైం స్కేల్ ఉద్యోగులకు కేడర్ వైజ్ పాలకమండలి సమావేశంలో ఆమోదించిన నేపథ్యంలో రిజిస్టర్ డాక్టర్ రమేష్ బాబు ను సన్మానిస్తున్న టైం స్కేల్ ఉద్యోగులు.



# సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో నాగ-శాంతి పూజ







అనంతపురం, కదిలించే వార్త, ఆగస్టు 22 :పవిత్ర శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఈ సోమనాథ నగర్ లోని కోదండరామ స్వామి దేవాలయంలో సప్త శనివారం వ్రతం జరుగుతున్న విషయం విధితమే.ఈరోజు ఆరో వారం సప్త శనివారంల వ్రతం జరిగింది అందులోనే నాగశ్శాంతి పూజా కార్యక్రమాన్ని పురోహితులు దేవరకొండ బాలాజీ శర్మ పర్యవేక్షణలో జరిగినది అని సాయి ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ విజయ సాయికుమార్ తెలిపారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నాగ శాంతి పూజ నిర్వహించారు అనంతరం నారాయణ సేవ భక్తులందరికీ జరిగినది ఈ కార్యక్రమంలో సాయి ట్రస్ట్ బృందం నరేష్ కార్యక్రమం సేవాకర్త వై.రుక్మిణి రాఘవేంద్ర కె వి ఎస్ ప్రకాష్ దంపతులు తదితరులు పాల్గొన్నారు

# చిన్న వయసు నుంచే వ్యక్తిగత పరిశుభ్రత నేర్చుకోవాలి

### -విద్యార్థులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచన
### -రాజేంద్ర మున్సిపల్ స్కూల్లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం
### -ఎంపీ అంబికాతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి






అనంతపురం, కదిలించే వార్త, ఆగస్టు 22 : చిన్న వయసు నుంచే వ్యక్తిగత పరిశుభ్రత నేర్చుకోవాలని.. విద్యార్థులకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. రాజేంద్ర మున్సిపల్ స్కూల్లో జరిగిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి పాల్గొన్నారు. ముందుగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్థానిక టీడీపీ నాయకులు, మున్సిపల్ అధికారులతో కలిసి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. విద్యార్థులకు పరిశుభ్రతపై ఎమ్మెల్యే, ఎంపీ అధికారులు అవగాహన కల్పించారు. భోజనంకి ముందు, తర్వాత చేతులు బాగా కడగాలని.. ప్రతి రోజు స్నానం చేయాలన్నారు. మీ ఇంట్లో కానీ, పాఠశాలలో కానీ చెత్తను బుట్టల్లో మాత్రమే వేయరాదని.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మీ ఇంటి వద్ద, పాఠశాలలో మొక్కలను సంరక్షించాలని.. పరిశుభ్రతపై ఇంట్లో తల్లిదండ్రులకు కూడా మీరు చెప్పాలని ఎమ్మెల్యే దగ్గుపాటి సూచించారు. అనంతరం విద్యార్థుల విద్యార్థులతో స్వర్ణాంధ్ర - స్వచ్ఛంద్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ ఎస్ఈ, ఇంచార్జ్ కమిషనర్ రాజశేఖర్, వీసీ రాజారవీంద్ర, కార్పొరేషన్ డైరెక్టర్లు రంగాచారి, పి ఎల్ ఎన్ మూర్తి, బెస్త పవన్ కుమార్, పోతుల లక్ష్మీనరసింహులు, పరమేశ్వర్, కడియాల కొండన్న, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, టిడిపి నాయకులు పుల్లన్న, సాకే లక్ష్మీనరసింహ, మారుతి కుమార్ గౌడ్, సున్నం శ్రీనివాసులు, కదిరప్ప, గోపాల్ గౌడ్, వన్నురప్ప, దాడి రమేష్, సికిందర్, మనోహర్ నాయుడు, బిల్డర్ రాము, వంశీ, డిష్ నాగరాజు, యమున, జైనుభి, సుజాతమ్మ, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.




# నగరపాలక సంస్థలో ఫైల్స్ ఎక్కడ పెండింగ్ లో ఉండకూడదు

### నగరపాలక సంస్థ రాజు కి ఎమ్మెల్యే దగ్గుపాటి ఆదేశాలు
### క్యాంపు కార్యాలయంలో ఎస్.ఇ తో సమావేశం.. పలు అంశాలపై సమీక్ష



అనంతపురం, కదిలించే వార్త, ఆగస్టు 22 :

నగరపాలక సంస్థలో పన్నుల బకాయిలపై ప్రత్యేకంగా దృష్టి సారించి ఆదాయం పెరిగే విధంగా చూడాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మున్సిపల్ రాజును ఆదేశించారు. శనివారం సాయంత్రం ఆయన తన క్యాంపు కార్యాలయంలో రాజు, టౌన్ ప్లానింగ్ అధికారితోపాటు ఇతర అధికారులతో సమావేశం అయ్యారు. నగర పాలక సంస్థల సిబ్బంది పనితీరు, హాజరు శాతం, పెండింగ్ లో ఉన్న ఫైళ్ల గురించి ఆరా తీశారు. ఆస్తి పన్ను, నీటి పన్ను, దుకాణాల లైసెన్స్ ఫీజుల వసూళ్ల గురించి ఆరా తీశారు. దీర్ఘకాలిక బకాయిలను వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఫైల్స్ ఎక్కడ పెండింగ్లో ఉండకూడదని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పోర్టల్ ద్వారా వచ్చే అర్జీలను కూడా నిర్ణీత గడువులోగా పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. కార్యాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆదేశించారు.

# మచ్చా దత్త రెడ్డి సూపర్ అర్థ సెంచరీ

### విజయనగరంలో జరుగుతున్న సీనియర్స్ రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్ పోటీల్లో



**అనంతపురం, కదిలించే వార్త, ఆగస్టు 22 :విజయనగరంలో జరుగుతున్న సీనియర్స్ రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్ క్రికెట్ మ్యాచ్ లో అనంతపురం జిల్లాకు చెందిన రంజీ క్రికెటర్ మచ్చా దత్త రెడ్డి అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నా రు అర్థ సెంచరీ పూర్తి చేశారు ఆంధ్ర రంజి జట్టును ఎంపిక చేయటానికి జరుగుతున్న పోటీలలోఈరోజు ఆంధ్ర డి జట్టుతోవిజయనగరంలో జరుగుతున్న సీనియర్స్ ప్రాబ్లమ్స్ పోటీలలో మచ్చ దత్త రెడ్డి అద్భుత బ్యాటింగ్ ప్రదర్శనతో 70 పరుగులు సాధించారు మూడు సిక్సర్లు ఎనిమిది ఫోర్లు గ్రౌండ్ నలుమూలల కొట్టారు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలోఆగస్టు 31 వరకు పోటీలు జరుగుతాయి విజయనగరంలో లోని నార్త్ జోన్ క్రికెట్ అకాడమీ నందు జరుగుతున్నసీనియర్స్ రాష్ట్రస్థాయి ప్రాబ్లమ్స్ క్రికెట్ పోటీలలో ఆంధ్ర ఏ జట్టుకు ఆంధ్ర డీ జట్లకు జట్ల మధ్య పోటీ ప్రారంభమైంది ఆంధ్ర బి జట్టు ఆంధ్ర సి జట్ట మధ్య మ్యాచులు ప్రారంభమయ్యాయిప్రతి మ్యాచ్ మూడు రోజులపాటు నిర్వహించడం జరుగుతుంది. మొత్తం ఈ పోటీలు ఆగస్టు 31 వరకు నిర్వహిస్తారు**

## స్వర్ణాంధ్ర కోసం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు




అనంతపురం, వైద్యం, కదిలించే వార్త, ఆగస్టు 22 :

స్వర్ణాంధ్ర కోసం స్వచ్ఛ ఆంధ్ర ......,స్వర్ణాంధ్రప్రదేశ్ సాధించే దిశగా స్వచ్ఛ ఆంధ్రను నిర్మించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లో భాగంగా శనివారం జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయం ఆవరణ అంతా సిబ్బంది అధికారులు స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞను చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ స్వచ్ఛత ద్వారా 90% అంటు రోగాలు నిర్మూలించవచ్చని తద్వారా ఆరోగ్య సాధన, ఆర్థిక పరిపుష్టి సాధ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి గిరిజ మనోహర్ రావు, మలేరియా అధికారి మనోజ్, ఆరోగ్య ట్రస్ట్ కోఆర్డినేటర్ గంగాధర్ రెడ్డి, స్వచ్ఛంద కోఆర్డినేటర్ సురేందర్ రెడ్డి, మాస్ మీడియా అధికారి, నాగరాజు, డిప్యూటీ మాస్ మీడియా అధికారి లక్ష్మీనారాయణ, స్టాటిస్టికల్ ఆఫీసర్ రఫీ, సూపరింటెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి: సీపీఐ

### రాయలసీమ ప్రజల న్యాయ ప్రయోజనాల కోసం శాశ్వత బెంచ్ తప్పనిసరి

అనంతపురం, కదిలించే వార్త, ఆగస్టు 22 :: రాయలసీమ ప్రాంత ప్రజల న్యాయపరమైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు డి జగదీష్ డిమాండ్ చేశారు . శనివారం జిల్లా సిపిఐ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో కూడా టిడిపి అధికారంలోకి వచ్చినప్పుడు కర్నూల్ లో బెంచ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న సర్క్యూట్ బెంచ్‌లు, మొబైల్ కోర్టులు వంటి తాత్కాలిక విధానాలు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేవని అయన పేర్కొన్నారు.రాయలసీమకు న్యాయ పరిపాలనలో సముచిత ప్రాధాన్యం కల్పించేందుకు శాశ్వత బెంచ్ ఏర్పాటు చేయడం అవసరమని పేర్కొన్నారు. రాయలసీమ ప్రజలకు న్యాయం అందుబాటులోకి రావాలంటే కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాల్సిందేనని స్పష్టం చేశారు..కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటైతే రాయలసీమలోని ప్రజలు ప్రతి న్యాయపరమైన అంశం కోసం అమరావతి వరకు వెళ్లాల్సిన అవసరం ఉండదని ఆయన తెలిపారు . దీనివల్ల ప్రజలకు ప్రయాణ భారం, సమయం, ఆర్థిక వ్యయం తగ్గడంతో పాటు న్యాయ సేవలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. శాశ్వత హైకోర్టు బెంచ్ కోసం రాయలసీమ వ్యాప్తంగా న్యాయవాదులు చేపడుతున్న విధుల బహిష్కరణ, ఆందోళనలకు సీపీఐ పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు . న్యాయవాదుల న్యాయమైన డిమాండ్‌ను ప్రభుత్వం వెంటనే పరిగణనలోకి తీసుకుని కర్నూలులో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జగదీష్ కోరారు.ప్రభుత్వం స్పందించకుండా ఆలస్యం చేస్తే ప్రజలు, న్యాయవాదులతో కలిసి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. రాయలసీమకు న్యాయపరమైన సమాన అవకాశాలు కల్పించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని జగదీష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున, నగర కార్యదర్శి శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవరెడ్డి, పద్మావతి, రమణ, రాజేష్ గౌడ్, కృష్ణుడు ధనుంజయ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.




# నోటీసు పొందిన ఓటర్లు తమకు కేటాయించిన తేదీన తప్పనిసరిగా విచారణకు హాజరుకావాలి

### - : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

అనంతపురం, కలెక్టరేట్, కదిలించే వార్త, ఆగస్టు 22 :

– అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో శనివారం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)పై జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ప్రెస్ మీట్ నిర్వహించారు.– ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత రెండు నెలలుగా జిల్లాలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాలు జరుగుతున్నాయని, నెల రోజుల పాటు డోర్–టు–డోర్ క్యాంపెయిన్ నిర్వహించి ఎన్యుమరేషన్ ఫారాలు సేకరించి, డ్రాఫ్ట్ పబ్లికేషన్ పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలన్నింటికీ ఓటర్ల జాబితా (ఎలక్టోరల్ రోల్స్) కాపీలను అందజేశామన్నారు. ప్రతి బూత్ పరిధిలో ఆబ్సెంట్ (ాూఎంవత్), షిఫ్టెడ్ (ాష్ట్రఅట్వం), డెత్ (ఱమ్ఫ్త్ర), డబుల్ (ఱశీబఎశ్రీవ) మరియు ఇతర కేటగిరీల ఓటర్ల వివరాలను పంచాయతీలు మరియు ఇతర బహిరంగ ప్రదేశాలలో అందుబాటులో ఉంచామన్నారు. మ్యాపింగ్ లేనివి మరియు సమాచార లోపాలున్న కేటగిరీలలో జిల్లా వ్యాప్తంగా 3,83,391 మందికి నోటీసులు జారీ చేయాల్సి ఉండగా, ఇప్పటికే 3,11,788 మందికి నోటీసులు సర్వ్ చేయడం జరిగిందని, మిగిలిన దాదాపు 70,000 నోటీసులను రాబోయే 3–4 రోజులలో (రోజుకు 10,000 నుండి 15,000 చొప్పున) పూర్తి చేస్తామన్నారు.ఇప్పటివరకు 1,06,967 మందికి సంబంధించి విచారణ (హియరింగ్) ప్రక్రియ పూర్తయిందని, వీటిలో 83,376 మంది వివరాలను పరిశీలించి, సరైనవిగా నిర్ధారించుకుని ఫైనల్ పబ్లికేషన్ కోసం ఖరారు చేశామన్నారు. ఇది కాకుండా, డ్రాఫ్ట్ నోటీసుల ఆధారంగా దాదాపు 3,94,000 మంది ఓటర్లను ఈఆర్ఓ / ఏఈఆర్ఓల పరిశీలన ద్వారా ఫైనల్ చేయడం జరిగిందని, రాబోయే 10 నుండి 15 రోజుల్లో ఈ ప్రక్రియ అంతా పూర్తి చేస్తామన్నారు. రోజుకు దాదాపు 15,000 విచారణలు (హీరింగ్స్) జరుగుతున్నాయన్నారు. ప్రతి ఈఆర్ఓ పరిధిలో 10 నుండి 25 మంది ఏఈఆర్ఓలను నియమించడం జరిగిందన్నారు. శింగనమలలో 30,000 వరకు ఉండగా, అనంతపూర్ అర్బన్ అసెంబ్లీ పరిధిలో అత్యధికంగా 90,000 కి పైగా నో–మ్యాపింగ్/తప్పులు ఉన్నందున అక్కడ 25 మంది ఏఈఆర్ఓలను నియమించామని, తక్కువ ఉన్న చోట్ల అయితే 10 నుంచి 15 వరకు ఏఈఆర్ఓలను నియామకం చేయడం జరిగిందన్నారు. నోటీసు పొందిన ఓటర్లు తమకు కేటాయించిన తేదీన తప్పనిసరిగా విచారణ (హీరింగ్)కు హాజరుకావాలన్నారు. ఒకవేళ కేటాయించిన తేదీన హాజరుకాలేని పక్షంలో, స్థానిక బిఎల్ఓని సంప్రదించి ప్రత్యామ్నాయ తేదీల్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. విచారణకు హాజరుకాకపోతే ఓటరు అక్కడ లేనట్లుగా భావించి, ఆ ఓటును తొలగించే అవకాశం ఉంటుంది కావున ఓటర్లందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

**- ఈనెల 23 మరియు 29, 30 తేదీలలో స్పెషల్ క్యాంపైన్ డేస్..:**



– ఎస్ఐఆర్ లో భాగంగా క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల కోసం ఆగస్టు 22, 23 మరియు 29, 30 తేదీలలో (శనివారాలు మరియు ఆదివారాలు) ప్రత్యేక ప్రచార దినాలు(స్పెషల్ క్యాంపైన్ డేస్)గా నిర్ణయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ తెలిపారు. ఈరోజు శనివారం స్పెషల్ క్యాంపైన్ డే నిర్వహించామన్నారు. ఈ ప్రత్యేక ప్రచార రోజులలో, ప్రతి పోలింగ్ స్టేషన్ యొక్క బూత్ లెవెల్ ఆఫీసర్, రాజకీయ పార్టీలచే నియమించబడిన బూత్ లెవెల్ ఏజెంట్‌లతో కలిసి ఆయా పోలింగ్ స్టేషన్లలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు.– పోలింగ్ కేంద్రంలో జాబితాలను పరిశీలించడానికి, దరఖాస్తులను స్వీకరించడానికి, దరఖాస్తుదారులకు మార్గనిర్దేశం చేయడానికి మరియు వారి సందేహాలను నివృత్తి చేయడానికి, ముసాయిదా ఓటర్ల జాబితాలు పరిశీలించడానికి /ాూఱఱ (ఆబ్సెంట్, షిఫ్ట్, డెత్, డబుల్) జాబితాలకు సంబంధించి జాబితాలు దీూాలకు అందుబాటులో ఉంచాలన్నారు. కొత్తవారు ఓటరుగా నమోదు కోసం ఫామ్–6 అప్లయి చేయాలి. మార్పులు, చేర్పులకు సంబంధించి ఫామ్–8 దరఖాస్తులు చేయవచ్చును. స్పెషల్ క్యాంపైన్ డేస్ పై విస్తృత ప్రచారం కల్పించాలని, దీనిని అందరూ ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఏ.మలోల, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భూ రీ-సర్వే పనుల్లో నాణ్యత, పారదర్శకత కీలకం

### ఈ-కేవైసీ, వెక్టొరైజేషన్ పనుల్లో వేగం పెంచాలి

### ఫేజ్--4, ఫేజ్--5 రీ-సర్వే గ్రామాల పురోగతిపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ ఎం. మౌర్య భరద్వాజ్





పుట్టపర్తి, కలెక్టరేట్, కదిలించే వార్త,ఆగస్టు, 22: రీ–సర్వే ఫేజ్––4, ఫేజ్––5 కింద ఎంపిక చేసిన గ్రామాల్లో జరుగుతున్న భూ సర్వే పనుల పురోగతి, నూతన డిజిటల్ విధానాల అమలు మరియు పనుల నాణ్యతపై మమ్మిళ్లకుంట క్రాస్‌లోని ూ.+. కన్వెన్షన్ హాల్ నందు 'రివ్యూ కమ్ వర్క్‌షాప్' నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ గారు పర్యవేక్షించగా, రెవెన్యూ మరియు సర్వే శాఖల ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో జిల్లాలోని ఆర్డీఓలు, ఆర్ఎస్‌డీటీలు, మండల సర్వేయర్లు మరియు ఫేజ్––4, ఫేజ్––5 గ్రామాలకు చెందిన గ్రామ సర్వేయర్లు పాల్గొని క్షేత్రస్థాయిలో ఉన్న సవాళ్లు, పరిష్కారాలపై సుదీర్ఘంగా చర్చించారు.వర్క్‌షాప్‌లో భాగంగా గ్రామ సర్వేయర్ భాస్కర్, ఆర్ఎస్‌డీటీలు యూనస్ మరియు యశ్వంత్ క్షేత్రస్థాయి సిబ్బందికి నూతన సాంకేతిక ప్రక్రియలపై ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. G.T. Notice e-KYC & G.T. Attendance e-KYC నమోదు విధానం,VS, VRO మరియు తహసీల్దార్ లాగిన్ వేదికగా భూ రికార్డుల నమోదు క్రమం,(GFP) ప్రక్రియను వేగవంతం చేయడం,రాజముద్ర కలిగిన పాస్‌బుక్స్ సకాలంలో ముద్రించి భూ యజమానులకు పంపిణీ చేసే చర్యలపై అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి భూ యజమాని/రైతు సర్వే ప్రక్రియపై పూర్తి సంతృప్తి చెందేలా పనులు పూర్తి కావాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.క్షేత్రస్థాయిలో Ground Truthing నిర్వహించేటప్పుడే G.T. e-KYC మరియు G.T. Attendance e-KYC ప్రక్రియలను అదే రోజున పూర్తి చేయాలి.సర్వే పూర్తయ్యే సమయానికి గ్రామంలో చుక్కల భూములు లేదా వివాదాస్పద రికార్డులు ఏవీ మిగలకుండా పరిష్కరించాలి.ఏకకాలంలో పనులు ప్రక్రియతో పాటు మ్యాపింగ్/వెక్టొరైజేషన్ పనులను కూడా సమాంతరంగా చేపట్టి పూర్తి చేయాలి.రిజిస్ట్రేషన్ల సమయంలో రైతులకు, భూ కొనుగోలుదారులకు భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పాత–కొత్త రికార్డుల అనుసంధాన ప్రక్రియను ఖచ్చితంగా నిర్వహించాలి.గుడ్ ఫర్ ప్రింటింగ్ శాతాన్ని గణనీయంగా పెంచి, భూహక్కు పత్రాల పంపిణీకి బాటలు వేయాలి.ూాదీం పంపిణీలో పారదర్శకత పాటిస్తూ భూ యజమానులకు అవసరమైన పూర్తి సమాచారాన్ని అందించాలి.జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ గారి మార్గదర్శకత్వంలో రీ–సర్వే పనులన్నీ నిర్ణీత కాలపరిమితిలోగా, ఏ చిన్న పొరపాటుకు తావులేకుండా నాణ్యతా ప్రమాణాల ప్రకారం పూర్తికావాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమములో పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్,మడకసిర ఆర్డీఓ నాగలక్ష్మి , రీసర్వే ఎడి విజయ శాంతి,డిటిలు,ఆర్ ఎస్డిటిలు సర్వేయర్లు తధితరులు పాల్గొన్నారు.

# ఎల్ నీనో దృష్ట్యా రైతాంగానికి మరింత అండగా ప్రభుత్వం

### రక్షక తడులు, ప్రత్యామ్నాయ సాగుపై రైతుల దృష్టి సారించాలి..

### 80% రాయితీపై 16 వేల క్వింటాల విత్తనాలు సిద్ధం

### ప్రతి పొలంలో రక్షక తడికి పొలం కుంటలు తవ్వుకోవాలి

### PMDS సాగు విధానం 2 లక్షల ఎకరాలకు విస్తరణ

### జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

### 'ఎల్ నీనో పరిణామాల పై సమీక్షించిన జిల్లా కలెక్టర్








పుట్టపర్తి, కలెక్టరేట్, కదిలించే వార్త,ఆగస్టు, 22:

ఎల్ నీనో దృష్ట్యా రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం మరింత అండగా ఉందని రక్షకతడులు ప్రత్యామ్నాయ సాగుపై రైతులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ రైతులకు సూచించారు.తీవ్ర వర్షాభావ పరిస్థితులు మరియు ఎల్ నీనో (El Nio) ప్రభావం చూపుతున్న వేళ రైతాంగాన్ని సన్నాహక పరిచేందుకు శుక్రవారం పుట్టపర్తి లోని సాయి ఆరామం ప్రాంగణంలో "ఎల్ నీనో పై కార్యాచరణ సమీక్ష సమావేశం" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కలెక్టర్ గారు మాట్లాడుతూ... జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు సాధారణ సాగు విస్తీర్ణంలో 45 శాతం మాత్రమే పంటలు సాగయ్యాయని, ప్రతికూల వాతావరణం వల్ల 57 శాతం వరకు లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు. ఇటువంటి క్లిష్టమైన వాతావరణ పరిస్థితుల్లోనూ ప్రకృతి వైపరీత్యాలను తట్టుకుంటూ వ్యవసాయ, ఉద్యానవన పంటల్లో అద్భుతమైన దిగుబడులు సాధిస్తున్న జిల్లా రైతుల శ్రమను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ప్రస్తుత తీవ్ర వర్షాభావ పరిస్థితులలో పైరుకి ఏ మోతాదులో నీరు అవసరమో, అంత మాత్రమే అందిస్తూ నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు.రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు జిల్లాలోని అర్హులైన ప్రతి రైతును ఇప్పటికే పంటల బీమా (జతీశీజూ ×అంబతీఖఅషవ) పరిధిలోకి ఎన్రోల్ చేయడం జరిగిందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో వర్షం కురిస్తే ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు వీలుగా 80 శాతం రాయితీపై పంపిణీ చేయడానికి ?16,000 క్వింటాల విత్తనాల కోటాను సిద్ధంగా ఉంచినట్లు వెల్లడించారు.జిల్లాలో పశుగ్రాసం కొరత తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా 1,000 ఎకరాల విస్తీర్ణంలో సామూహిక పశుగ్రాసం పెంచేందుకు సమగ్ర చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.జిల్లాలో ఇప్పటికే 94,000 ఎకరాల్లో ూవీణూ (ప్రకృతి వ్యవసాయ పద్ధతులు) ద్వారా వివిధ రకాల పంటలు సాగు చేస్తూ ఆశించిన ఉత్తమ ఫలితాలు సాధించామన్నారు. ఈ విజయవంతమైన మోడల్‌ను జిల్లాలో 2 లక్షల ఎకరాలకు విస్తరించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.కురిసే ప్రతి వర్షపు చుక్కనూ వడిసిపట్టుకోవడానికి రైతులు తమ పొలాల్లో ఖచ్చితంగా 'పొలం కుంటలు' తవ్వుకోవాలన్నారు. వర్షాభావ సమయంలో ఇవి పంటలకు అత్యంత కీలకమైన "రక్షక తడి" అందించేందుకు సహాయపడతాయని వివరించారు.బోర్ వెల్ సౌకర్యం ఉన్న ప్రతి రైతు ఖచ్చితంగా డ్రిప్ / బిందు సేద్య పరికరాలను ఉపయోగించి నీటి వృథాను అరికట్టాలన్నారు.సమావేశ ప్రాంగణంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు నూతనంగా అభివృద్ధి చేసిన "మట్టి నమూనా పరీక్ష కిట్" పనితీరును స్వయంగా రైతుల ఎదుట ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించారు. అంతేకాకుండా, నూనె గింజల పరిశోధన స్థానం వారు నూతనంగా రూపకల్పన చేసిన ఆముదం విత్తనాలను ప్రయోగాత్మకంగా సాగు చేయడం కోసం ఎంపిక చేసిన కొందరు రైతులకు పంపిణీ చేశారు.ఇదే వేదికపై, జిల్లాలో ప్రకృతి వ్యవసాయంలోనూ, అత్యుత్తమ సేద్యపు పద్ధతుల్లోనూ ఆదర్శంగా నిలిచిన పలువురు ప్రగతిశీల రైతులను జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ గారు ఘనంగా సన్మానించారు.ఈ సమీక్షా సమావేశం మరియు వర్క్‌షాప్‌లో చీూాూ=వీ శాస్త్రవేత్తలు రమేష్ నాయక్, సురేష్ కుమార్,జిల్లా వ్యవసాయ అధికారి కృష్ణయ్య,డిఆర్‌డిఎ పిడి నరసయ్య,డిడబ్ల్యుఎంఏ పిడి విజయకుమార్,ఏపిఎంఐపి పిడి దేవానంద,పట్టు పరిశ్రమ శాఖ అధికారిణి శోభారాణి,జిల్లా మార్కెటింగ్ అధికారి హాఫిజుల్లా, వ్యవసాయ శాస్త్రవేత్తలు భాస్కర్ రెడ్డి, చంద్రాయుడు, రామసుబ్బయ్య; జిల్లాలోని సహాయ వ్యవసాయ సంచాలకులు (ADA), వ్యవసాయ అధికారులు సహాయ అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రతినిధులు మరియు జిల్లా నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

